ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888

పాత్రికేయులు కావలెను
తెలంగాణ, ఆంధ్ర రాష్ట్ర వ్యాప్తంగా వెలువడుచున్న
ప్రజా రిపబ్లిక్
తెలుగు దినపత్రికలో తెలుగు రాష్ట్రాలలో బ్యూరోలు, జిల్లా స్టాపర్లు, నియోజకవర్గ మరియు మండల స్థాయి పాత్రికేయులు కావలెను.
ఆసక్తి గలవారు సంప్రదించండి
9948814188 9985876888

Published From Nandyal : Cerculated in Nandyal,Kurnool,Kadapa,tirupathi,Prakasam, Krishna,Guntur,Nellore and All Distircts

సంపుటి - 02 సంచిక -86 పేజీలు - 08 వెల - 06/- మంగళవారం 8 జులై 2025

# సచివాలయాల్లోనే వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్..



త్వరలో అమలులోకి!



- తహసీల్దార్ ఆఫీసుల చుట్టూ తిరగకుండానే భూమి రిజిస్ట్రేషన్!
- సీఎం చంద్రబాబు ఆదేశాలు..
- రూ.10 లక్షల లోపు ఆస్తికి రూ.100, ఆపైతే రూ.1000 రుసుము
- రిజిస్ట్రేషన్‌తో పాటే ఆటోమేటిక్ మ్యుటేషన్, ఈ-పాస్‌బుక్ జారీ

అమరావతి, **జూలై7(రిపబ్లిక్ న్యూస్:-** ఆంధ్రప్రదేశ్‌లో వారసత్వంగా సంక్రమించిన భూముల రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత సులభతరం చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఈ ఆస్తుల రిజిస్ట్రేషన్ కోసం వారసులు తహసీల్దార్ కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన అవసరం లేకుండా తమ గ్రామ/వార్డు సచివాలయాల్లోనే రిజిస్ట్రేషన్ చేసుకునే వెసులుబాటు కల్పించనుంది. ఈ మేరకు ఇటీవల ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు జరిపిన సమీక్షా సమావేశంలో ఆదేశాలు జారీ చేశారు.అంతేకాదు, రిజిస్ట్రేషన్ కింద నామమాత్రపు ఫీజు వసూలు చేయాలని నిర్ణయించారు. మార్కెట్ విలువ ప్రకారం ఆస్తి విలువ రూ.10 లక్షల లోపు ఉంటే కేవలం రూ.100, అంతకు మించి ఉంటే రూ.1000 స్టాంపు డ్యూటీగా చెల్లిస్తే సరిపోతుంది. యజమాని మరణ ధ్రువీకరణ పత్రం, ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్‌తో పాటు వారసులందరూ ఏకాభిప్రాయంతో రాతపూర్వకంగా వస్తే, సచివాలయాల్లోని డిజిటల్ అసిస్టెంట్లు ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేస్తారు. మిగతాది 2లో...

# బ్రిక్స్ అనుకూల దేశాలపై ట్రంప్ టారిఫ్‌లు




- బ్రిక్స్ అనుకూల దేశాలపై 10 శాతం అదనపు టారిఫ్‌లు: ట్రంప్
- బ్రిక్స్ దేశాలు అమెరికా వ్యతిరేక విధానాలను అనుసరిస్తున్నాయని ఆరోపణ
- సోషల్ మీడియా ద్వారా సంచలన ప్రకటన చేసిన ట్రంప్
- ఏకపక్ష సుంకాలపై బ్రిక్స్ దేశాల తీవ్ర ఆందోళన
- బ్రెజిల్‌లో జరుగుతున్న బ్రిక్స్ సదస్సు వేళ కీలక పరిణామం

**జూలై7(రిపబ్లిక్ న్యూస్:-**
అమెరికా, బ్రిక్స్ దేశాల మధ్య వాణిజ్య యుద్ధం మరింత తీవ్ర రూపం దాల్చింది. బ్రిక్స్ కూటమి అనుసరిస్తున్న అమెరికా వ్యతిరేక విధానాలకు మద్దతిచ్చే ఏ దేశంపైన అయినా అదనంగా 10 శాతం సుంకాలు విధిస్తామని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సంచలన ప్రకటన చేశారు. ఈ విధానంలో ఎలాంటి మినహాయింపులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. మిగతాది 2లో...

# అమరావతిలో దేశంలోనే అతిపెద్ద క్వాంటమ్ టెస్ట్ బెడ్

గేట్ వే హబ్‌గా అమరావతి అభివృద్ధికి ఏపీ ప్రభుత్వ ఆమోదం
క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్‌కు గ్రీన్ సిగ్నల్
కీలక ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం
ఏడాదిలోగా అమరావతిలో 'క్యూ-చిప్-ఇన్'

2లో



# టెక్నాలజీతో జీరో క్రైమ్ రేట్ సాధించాలి


2లో

రియల్ టైమ్ గవర్నెన్స్ పై సీఎం చంద్రబాబు సమీక్ష
క్రైమ్ హాట్ స్పాట్స్‌పై సీసీ కెమెరాలతో నిరంతర నిఘా
ప్రభుత్వ రికార్డుల భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ
పిడుగులు పడే ప్రదేశంలో ముందుగానే సైరన్ హెచ్చరికలు

# భారత్, పాక్‌ను ఒకే త్రాసులో తూకం వేయలేం



**జమ్ము కశ్మీర్, జూలై7(రిపబ్లిక్ న్యూస్:-** జమ్ము కశ్మీర్‌లోని పహల్గాంలో పర్యాటకులపై జరిగిన ఉగ్రదాడిని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ మరోసారి తీవ్రంగా ఖండించారు. ఈ మేరకు పొరుగుదేశం పాకిస్థాన్ పై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు.బ్రెజిల్‌లో జరిగిన బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోదీ పాల్గొని ప్రసంగించారు. పాక్ ఉగ్రవాద మిగతాది 2లో...

# ప్రతిపక్షంలో ఉన్నా జగన్ వైఖరి మారలేదు

మీ తండ్రి హయాంలోనే భయపడలేదు..
మీ రప్పా రప్పాకు భయపడతామా?: మంత్రి నారా లోకేశ్
అధికారం పోయినా ఇంకా హెలికాప్టర్‌లోనే తిరుగుతున్నారని విమర్శ
బ్లేడ్, గంజాయి బ్యాచ్‌లను వైసీపీ ప్రోత్సహించిందని వ్యాఖ్య
నెల్లూరులో టీడీపీ నేతలతో మంత్రి సమన్వయ సమావేశం



**నెల్లూరు జూలై7(రిపబ్లిక్ న్యూస్:-**
"మీ తండ్రి వైఎస్ రాజశేఖర రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు మా పార్టీకి చెందిన 164 మంది కార్యకర్తలను పొట్టనబెట్టుకున్నారు. ఆనాడే మేము భయపడలేదు. ఇప్పుడు అధికారం కోల్పోయిన మీ బెదిరింపులకు భయపడతామా?" అంటూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పై రాష్ట్ర ఐటీ, మానవ వనరుల శాఖ మంత్రి నారా లోకేశ్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. మిగతాది 2లో...

# చంద్రబాబు, పవన్ సమాధానం చెప్పాలి



2లో

వైఎస్సార్ ఆర్కిటెక్చర్ వర్సిటీ విద్యార్థుల ఆందోళనకు షర్మిల మద్దతు
సీఓఏ గుర్తింపు లేకుండా అడ్మిషన్లపై యాజమాన్యాన్ని నిలదీత
జగన్, అవినాశ్‌తో పాటు చంద్రబాబు, పవన్‌పైనా విమర్శలు
విద్యార్థుల సమస్యను వెంటనే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ డిమాండ్

# తెలంగాణలో జాతీయ క్రీడలు నిర్వహించండి

ఢిల్లీ పర్యటనలో కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయతో రేవంత్ భేటీ
'ఖేలో ఇండియా', '40వ జాతీయ క్రీడలు' రాష్ట్రానికి కేటాయించాలని కోరిక
క్రీడా వసతుల అభివృద్ధికి నిధులు ఇవ్వాలని మనవి
క్రీడాకారులకు రైలు ఛార్జీల రాయితీ పునరుద్ధరించాలని డిమాండ్


2లో

# మామిడి రైతులకు ప్రభుత్వం అండ

కొనుగోళ్లు చేసేలా పలు కంపెనీలకు ఆదేశం


2లో

రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం
RNI No:/2023/87888
మంగళవారం 8 జులై 2025

# సచివాలయాల్లోనే వారసత్వ ఆస్తుల రిజిస్ట్రేషన్..

(మొదటి పేజి తరువాయి)

గతంలో తహసీల్దార్ కార్యాలయాల్లో మ్యుటేషన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే తీవ్ర జాప్యం జరుగుతోందని, సిబ్బంది పదేపదే తిప్పిస్తున్నారని ప్రభుత్వానికి వేల సంఖ్యలో ఫిర్యాదులు అందాయి. ఈ నేపథ్యంలో, ప్రజల ఇబ్బందులను తొలగించేందుకు ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. సచివాలయాల్లో రిజిస్ట్రేషన్ చేయగానే భూ రికార్డుల్లో వివరాల నమోదు (మ్యుటేషన్) ఆటోమేటిక్‌గా జరిగిపోతుంది. దీంతో పాటు వారసులకు ఈ-పాస్‌బుక్ కూడా జారీ చేస్తారు.
ఈ విధానం అమలులోకి రావడానికి మరో రెండు, మూడు నెలల సమయం పట్టే అవకాశం ఉంది. రెవెన్యూ శాఖ మార్గదర్శకాలు విడుదల చేశాక, స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ దీనిని అమలు చేస్తుంది. స్థానిక సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల పర్యవేక్షణలో ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగనుంది. కేవలం వారసత్వ ఆస్తులకు మాత్రమే ఈ విధానం వర్తిస్తుందని, ఇతర రిజిస్ట్రేషన్లు యథావిధిగా సబ్-రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనే జరుగుతాయని అధికారులు స్పష్టం చేశారు.

# అమరావతిలో దేశంలోనే అతిపెద్ద క్వాంటమ్ టెస్ట్ బెడ్

అమరావతి, **జూలై7(రిపబ్లిక్ న్యూస్:-**
ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతిని అత్యాధునిక సాంకేతిక కేంద్రంగా తీర్చిదిద్దే దిశగా కూటమి ప్రభుత్వం కీలక అడుగు వేసింది. అమరావతిని 'క్వాంటమ్ గేట్ వే హబ్'గా అభివృద్ధి చేయాలన్న లక్ష్యంతో రూపొందించిన 'క్వాంటమ్ వ్యాలీ డిక్లరేషన్'కు ఆమోదముద్ర వేసింది. ఈ మేరకు అధికారికంగా ఉత్తర్వులను జారీ చేసింది.గత నెల జూన్ 30న విజయవాడలో జరిగిన క్వాంటమ్ వ్యాలీ వర్క్‌షాప్‌లో ఈ డిక్లరేషన్‌ను రూపొందించారు. ఈ డిక్లరేషన్ కు ఆమోదం తెలపడం ద్వారా అమరావతిలో క్వాంటమ్ టెక్నాలజీ అభివృద్ధికి ప్రభుత్వం మార్గాన్ని సుగమం చేసింది. ఈ ప్రతిష్ఠాత్మక ప్రాజెక్టులో భాగంగా, దేశంలోనే అతిపెద్ద క్వాంటమ్ టెస్ట్ బెడ్ అయిన 'క్యూ-చిప్-ఇన్'ను రాబోయే 12 నెలల్లోగా అమరావతిలో ఏర్పాటు చేయనున్నట్లు తాజా ఉత్తర్వుల్లో ప్రభుత్వం స్పష్టం చేసింది.ఈ కార్యక్రమం ద్వారా రాష్ట్రంలో క్వాంటమ్ టెక్నాలజీకి సంబంధించిన పరిశోధన, ఆవిష్కరణలు, అభివృద్ధి, మౌలిక సదుపాయాల కల్పనతో పాటు అంతర్జాతీయ భాగస్వామ్యాలకు అధిక ప్రాధాన్యత ఇవ్వనున్నారు. ఈ నిర్ణయంతో భవిష్యత్ టెక్నాలజీ రంగంలో అమరావతి కీలక పాత్ర పోషించనుందని నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

# బ్రిక్స్ అనుకూల దేశాలపై ట్రంప్ టారిఫ్‌లు

(మొదటి పేజి తరువాయి)

సోమవారం తన సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ హెచ్చరికలు జారీ చేశారు. "బ్రిక్స్ కూటమి అవలంబిస్తున్న అమెరికా వ్యతిరేక విధానాలతో ఏ దేశం ఏకీభవించినా, ఆ దేశంపై అదనంగా 10 శాతం సుంకం విధిస్తాం. ఈ విషయంలో మీరంతా దృష్టి సారించినందుకు ధన్యవాదాలు" అని ఆయన పేర్కొన్నారు. ఈ కొత్త సుంకాల విధానానికి సంబంధించిన అధికారిక లేఖలను సోమవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి వివిధ దేశాలకు పంపనున్నట్లు మరో సందేశంలో తెలిపారు.ప్రస్తుతం బ్రెజిల్‌లోని రియో డి జెనీరోలో బ్రిక్స్ దేశాల శిఖరాగ్ర సదస్సు జరుగుతోంది. ఈ సదస్సులో అమెరికా ఏకపక్షంగా సుంకాలను పెంచడంపై బ్రిక్స్ దేశాల నేతలు తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు. "ఏకపక్షంగా, విచక్షణారహితంగా సుంకాలను పెంచడం, ప్రపంచ వాణిజ్య సంస్థ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించడంపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నాం" అని బ్రిక్స్ దేశాలు ఉమ్మడి ప్రకటనలో తెలిపాయి. పర్యావరణ పరిరక్షణ పేరుతో అభివృద్ధి చెందుతున్న దేశాలపై కొన్ని అభివృద్ధి చెందిన దేశాలు వాణిజ్య ఆంక్షలు విధించడాన్ని కూడా వారు తప్పుబట్టారు.ప్రస్తుతం బ్రిక్స్ కూటమిలో బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాతో పాటు సౌదీ అరేబియా, ఈజిప్ట్, యూఏఈ, ఇథియోపియా, ఇండోనేషియా, ఇరాన్ సభ్య దేశాలుగా ఉన్నాయి. బ్రిక్స్ దేశాల ప్రకటన వెలువడిన కొద్దిసేపటికే ట్రంప్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

# టెక్నాలజీతో జీరో క్రైమ్ రేట్ సాధించాలి

**: సీఎం చంద్రబాబు**

**రియల్ టైమ్ గవర్నెన్స్ పై సీఎం చంద్రబాబు సమీక్ష**

**క్రైమ్ హాట్ స్పాట్స్‌పై సీసీ కెమెరాలతో నిరంతర నిఘా**

**ప్రభుత్వ రికార్డుల భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ**

**పిడుగులు పడే ప్రదేశంలో ముందుగానే సైరన్ హెచ్చరికలు**



అమరావతి, **జూలై7(రిపబ్లిక్ న్యూస్:-**
టెక్నాలజీని వినియోగించుకుని జీరో క్రైమ్ రేట్ స్టేట్ గా ఆంధ్రప్రదేశ్ ను తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులకు సూచించారు. సాంకేతికత వినియోగించుకుని శాంతి భద్రతల పర్యవేక్షణలో ఆంధ్రప్రదేశ్ ను ఓ మోడల్ రాష్ట్రంగా మార్చాలని స్పష్టం చేశారు. సోమవారం నాడు ఏపీ సచివాలయంలో రియల్ టైమ్ గవర్నెన్సుపై ముఖ్యమంత్రి అధికారులతో సమీక్ష నిర్వహించారు. సీసీ కెమెరాలతో క్రైమ్ హాట్ స్పాట్లపై నిరంతరం నిఘా పెట్టి నేరాల నియంత్రణ చేయాలన్నారు. దీంతో పాటు ప్రైవేటు సీసీ కెమెరాల ఫుటేజి వ్యవహారంలోనూ నిబంధనలు మార్చేలా చర్యలు తీసుకోవాలని సీఎం ఆదేశించారు. నేరాల నియంత్రణకు ప్రైవేటు కెమెరాలను కూడా వినియోగించుకునేలా చూడాలని స్పష్టం చేశారు.
రాజకీయ ముసుగులో నేరాలకు పాల్పడే వారి విషయంలో టెక్నాలజీని మరింతగా ఉపయోగించుకోవాలన్నారు. కొందరు తెలివిగా నేరాలు చేసి.. దాన్ని ప్రభుత్వంపై నెడుతున్నారని.. పోలీసులకు సహకరించని వ్యక్తులు, నేతల విషయంలో మరింత అప్రమత్తంగా ఉండాలని చంద్రబాబు సూచించారు. ఇలాంటి వారి కోసం పబ్లిక్ సేఫ్టీ యాక్టు కింద వారి వద్ద నుంచి డేటాను తీసుకునేందుకు చర్యలు చేపట్టాలని అన్నారు. ఆయా నేరాలకు బాధ్యులుగా చేసే అంశంపైనా దృష్టి పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.
ప్రజా భద్రత కోసం.. నేరాల కట్టడి కోసం.. దర్యాప్తు నిమిత్తం.. షాపింగ్ మాల్స్, థియేటర్లు, హోటళ్ల వద్ద ఉండే సీసీ కెమెరాల్లోని ఫుటేజీని సేకరించే వంటి వాటి విషయాల్లోనూ పబ్లిక్ సేఫ్టీ యాక్టును వర్తింప చేయాలన్నారు. మరోవైపు వివిధ రంగాల్లో డ్రోన్లు, సీసీ కెమెరాల వినియోగం పెంచాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఓర్వకల్లులో డ్రోన్ సిటీ పురోగతిపైనా అధికారుల నుంచి వివరాలు అడిగి తెలుసుకున్నారు.

**ప్రభుత్వ రికార్డుల భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీ**

వివిధ ప్రభుత్వ శాఖలకు చెందిన రికార్డులు, డేటా భద్రతకు బ్లాక్ చెయిన్ టెక్నాలజీని వినియోగించాలని ముఖ్యమంత్రి సూచించారు. ప్రస్తుతం రెవెన్యూ రికార్డులను కూడా పూర్తి స్థాయి ప్రక్షాళన చేసి నూతన సాంకేతికతనే వినియోగించి భద్రంగా ఉండేలా చూడాలన్నారు. వివిధ ప్రభుత్వ శాఖలకు సంబంధించిన సమాచారం డేటా లేక్ ద్వారా సమన్వయం చేయాలని సీఎం స్పష్టం చేశారు. మరోవైపు 517 పౌరసేవల్ని వాట్సప్ గవర్నెన్సు ద్వారా అందిస్తున్నట్టు అధికారులు వివరించారు. అయితే అందిస్తున్న సేవలన్నీ యూజర్ ఫ్రెండ్లీగా ఉండేలా చూడాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. పిడుగులు పడే ప్రాంతాల్లో విలువైన ప్రాణాలు కాపాడటమే లక్ష్యంగా పనిచేయాలని.. ముందస్తు హెచ్చరికల వ్యవస్థ సమర్ధంగా పనిచేసేలా చూడాలని సీఎం స్పష్టం చేశారు. ముందుగానే ఆయా ప్రాంతాల్లో సైరన్ మోగేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. భూగర్భ జలాల పర్యవేక్షణకు ఫీజియో మీటర్లు, సెన్సార్లు త్వరితగతిన పునరుద్ధరించాలని అన్నారు. రిజర్వాయర్లలో ప్రస్తుతం ఉన్న నీరెంత, ఎంతమేర ప్రవాహాలు వస్తున్నాయి. సముద్రంలోకి విడుదల చేస్తున్న నీరెంత లాంటి వివరాలు నమోదు చేయాలన్నారు. రిజర్వాయర్లలో వచ్చే ప్రవాహాలకు సంబంధించిన వివరాలను రియల్ టైమ్ లో పర్యవేక్షిస్తే వరద నిర్వహణ చేయొచ్చన్నారు. ప్రస్తుతం వస్తున్న ప్రవాహాలతో రాష్ట్రంలోని అన్ని రిజర్వాయర్లనూ పూర్తి సామర్ధ్యంతో నింపుతున్నట్టు సీఎం స్పష్టం చేశారు.

# మామిడి రైతులకు ప్రభుత్వం అండ

## కొనుగోళ్లు చేసేలా పలు కంపెనీలకు ఆదేశం

అమరావతి, **జూలై7(రిపబ్లిక్ న్యూస్:-**
మామిడి కొనుగోలుపై ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. రైతులకు నష్టం జరక్కుండా కొనుగోళ్లకు చర్లు చేపట్టింది. ఇందులో భాగంగా మామిడి కొనుగోళ్లపై ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ప్రతిరోజూ సమీక్షిస్తున్నారు. ఇందుకోసం మూడు జిల్లాల కలెక్టరేట్లలో కమాండ్ కంట్రోల్ సెంటర్లను ముఖ్యమంత్రి ఏర్పాటు- చేశారు. 50వేల మందికి పైగా రైతుల నుంచి మామిడి కొనుగోళ్లు చేసేలా చర్యలు తీసుకున్నారు. రైతుల నుంచి పర్లే, ఆగ్రో, కోకోకోలా, పెప్సీ వంటి సంస్థలు.. మామిడి కొనుగోలు చేసేలా సీఎం చంద్రబాబు ఆదేశాలు జారీ చేశారు. మామిడి రైతులను ఆదుకునేందుకు రూ.130 కోట్లు విడుదల చేయాలని ఇప్పటికే కేంద్ర ప్రభుత్వానికి సీఎం చంద్రబాబు లేఖ రాశారు. ప్రభుత్వ తీసుకుంటున్న చర్యలు మామిడి రైతుల విషయంలో సత్ఫలితాలను ఇస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో కేజీ రూ.12 చెల్లించి కొనుగోళ్లు చేస్తున్నారు. ఇప్పటి వరకూ చిత్తూరు, అన్నమయ్య, తిరుపతి జిల్లాల్లో 3,08,261 మెట్రిక్ టన్నుల మేర మామిడిని ట్రేడర్లు, ప్రాసెసింగ్ యూనిట్ల వారు కొనుగోలు చేశారు. మొత్తంగా ఈ సీజన్‌లో 3,75,000 మెట్రిక్ టన్నుల మేర మామిడి ఉత్పత్తి అవుతుందని అంచనా వేశారు. చిత్తూరు జిల్లాలో 1.65 లక్షల మెట్రిక్ టన్నులు, తిరుపతి జిల్లాలో 45 వేల మెట్రిక్ టన్నులు, అన్నమయ్య జిల్లాలో 16,400 మెట్రిక్ టన్నుల మేర మామిడి కొనుగోళ్లు చేశారు. ర్యాంపులు , మండీల ద్వారా మరో 81 వేల మెట్రిక్ టన్నుల మామిడి ఇతర రాష్ట్రాలకు విక్రయాలు జరిగాయి. మొత్తం 50,922 మంది రైతుల నుంచి మామిడి కొనుగోళ్లు అయ్యాయి. మామిడి రైతులకు అండగా ఉన్నామని మంత్రిఅచ్చన్నాయుడు అన్నారు. రైతులకు గత ప్రభుత్వం సరిగా ఆదుకోలేదన్నారు. కానీ తమ ప్రభుత్వంమామిడిన మద్దతు ఇచ్చి కొనుగోలు చేస్తోందని అన్నారు.

# తెలంగాణలో జాతీయ క్రీడలు నిర్వహించండి

**ఢిల్లీ పర్యటనలో కేంద్రమంత్రి మన్‌సుఖ్ మాండవీయతో రేవంత్ భేటీ**

**జూలై7(రిపబ్లిక్ న్యూస్:-**
తెలంగాణలో క్రీడారంగానికి పెద్దపీట వేసే దిశగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రయత్నాలు ముమ్మరం చేశారు. తన ఢిల్లీ పర్యటనలో భాగంగా ఆయన సోమవారం కేంద్ర క్రీడల శాఖ మంత్రి మన్‌సుఖ్ మాండవీయతో సమావేశమయ్యారు. తెలంగాణను జాతీయ, అంతర్జాతీయ క్రీడలకు వేదికగా మార్చేందుకు అవకాశం కల్పించాలని ఈ భేటీలో ఆయన కేంద్రమంత్రిని కోరారు.రాష్ట్రంలో 'ఖేలో ఇండియా'తో పాటు ప్రతిష్ఠాత్మకమైన 40వ జాతీయ క్రీడలను నిర్వహించేందుకు అనుమతి ఇవ్వాలని ముఖ్యమంత్రి రేవంత్ విన్నవించారు. ఈ మెగా ఈవెంట్ల నిర్వహణకు తెలంగాణ అన్ని విధాలా సిద్ధంగా ఉందని ఆయన వివరించారు. క్రీడల నిర్వహణకు అవసరమైన శిక్షణ, వసతుల కల్పన కోసం 'ఖేలో ఇండియా' పథకం కింద ప్రత్యేకంగా నిధులు కేటాయించాలని కోరారు.
అదేవిధంగా, జాతీయ క్రీడల్లో పాల్గొనేందుకు వెళ్లే క్రీడాకారులకు గతంలో రైలు ఛార్జీల్లో అందిస్తున్న రాయితీని పునరుద్ధరించాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్రమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనివల్ల దేశవ్యాప్తంగా ఎందరో క్రీడాకారులకు ప్రయోజనం చేకూరుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి విజ్ఞప్తులపై కేంద్రమంత్రి సానుకూలంగా స్పందించారు.

# ప్రతిపక్షంలో ఉన్నా జగన్ వైఖరి మారలేదు

(మొదటి పేజి తరువాయి)

ప్రతిపక్షంలోకి వచ్చినా జగన్ వైఖరిలో ఎలాంటి మార్పు రాలేదని, ఆయన పర్యటనలంటేనే ప్రజల ప్రాణాలు తీయడమని ఘాటుగా విమర్శించారు. నెల్లూరులోని అనిల్ గార్డెన్స్‌లో టీడీపీ పట్టణ నియోజకవర్గ కార్యకర్తలు, నేతలతో నిర్వహించిన సమన్వయ సమావేశంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు."మాజీ ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఎక్కడికి వెళ్లినా మనుషుల్ని చంపుకుంటూ వెళుతున్నారు, పల్నాడు జిల్లా పర్యటనలో ఒకరిని పరామర్శించడానికి వెళ్లి ముగ్గురిని చంపారు. ఒకరిని కారు కింద పడేసి చంపారు. రెండో వ్యక్తి ఊపిరాడక చనిపోయారు. మూడో వ్యక్తి అంబులెన్స్ లో ఇరుక్కుపోయారు. జనసమీకరణ మనం చేయలేక కాదు.. మనవల్ల ప్రజలు ఇబ్బంది పడకూడదు. కార్యకర్త కారు కిందపడితే కనీసం దిగి చూడలేదు. కార్యకర్తను రోడ్డున పక్కన పడేసి వెళ్లిపోయారు. దిగి చూసి ఆసుపత్రికి పంపించి ఉంటే బతికేవాడు. బాధిత కుటుంబం తల్లిని తీసుకువచ్చి కనీసం కూర్చోపెట్టలేదు. గ్లాస్ మంచినీరు అయినా ఇచ్చారా? సొంత కార్యకర్త చనిపోతే నిల్చొని రెండు భుజాలు తట్టి వెళ్లిపోయారు.
వైసీపీ తీరును ప్రజల్లోకి తీసుకెళ్లాలి. బ్లేడ్ బ్యాచ్ ను, గంజాయి బ్యాచ్ ను ప్రోత్సహిస్తున్నారు. మీ తండ్రి హయాంలోనే 164 మంది కార్యకర్తలను చంపారు. అప్పుడే భయపడలేదు, మీ రప్పా, రప్పాకు భయపడతామా? ప్రతిపక్షంలో ఉండగా బాబు గారి ఇంటి గేటుకు తాళ్లు కట్టారు. వీరు మాట్లాడతున్నారు. ప్రజాస్వామ్యంలో ఎవరికైనా తిరిగే హక్కు ఉంది. తిరగమంటే మనుషులను చంపుతున్నారు. నిబంధనలు పాటించమంటే ఎదురుదాడి చేస్తున్నారు. చిన్నసందులో వెళ్తా, మరో ముగ్గురుని చంపుతా అంటున్నారు.

## టీడీపీ కార్యకర్తలు అలక మానుకోవాలి

"మనకు ఉన్న పెద్ద జబ్బు అలగడం. పార్టీలో సంస్కరణల కోసం నేను పోరాడుతున్నా. కొన్ని నిర్ణయాలు తప్పు కావచ్చు. నమ్ముకున్న సిద్ధాంతం కోసం పోరాడుతున్నా. ఒక్కసారి చంద్రబాబు గారు నిర్ణయం తీసుకున్న తర్వాత తలవంచి పనిచేస్తా. పార్టీ ఫస్ట్, కార్యకర్తలు ఫస్ట్. కార్యకర్తలు అలక మానుకోవాలి. మన సమస్యలు కలిసికట్టుగా కూర్చొని మనమే పరిష్కరించుకోవాలి..." అని లోకేశ్ హితవు పలికారు.
సమన్వయ సమావేశం అనంతరం దాదాపు 1500 మందిని మంత్రి నారా లోకేష్ కలిశారు. వివిధ సమస్యలపై ప్రజలు, కార్యకర్తల నుంచి అర్జీలు స్వీకరించారు. సమస్యల పరిష్కరించి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారు. అనంతరం ప్రతిఒక్కరితో కలిసి ఫోటోలు దిగారు.
ఈ కార్యక్రమంలో మంత్రి పి.నారాయణ, జిల్లా ఇంఛార్జ్ మంత్రి ఎన్ఎండీ ఫరూఖ్, జిల్లా టీడీపీ అధ్యక్షుడు షేక్ అబ్దుల్ అజీజ్, ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎమ్మెల్సీలు భూమిరెడ్డి రాంగోపాల్ రెడ్డి, బీద రవిచంద్ర యాదవ్, నుడా ఛైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, ఏపీ ఖాదీ అండ్ ఇండస్ట్రీస్ బోర్డు ఛైర్మన్ కేపీ చౌదరి తదితరులు పాల్గొన్నారు.



**భిక్షాటన చేసే చిన్నారులకు మంత్రి లోకేశ్ అండ...**
**ఆ ఇద్దరికీ వీఆర్ స్కూల్‌లో అడ్మిషన్**

వీధుల్లో భిక్షాటన చేస్తూ జీవనం సాగిస్తున్న ఇద్దరు నిరుపేద చిన్నారుల జీవితాల్లో ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ కొత్త వెలుగులు నింపారు. చదువుకోవాలన్న వారి ఆకాంక్షను నెరవేరుస్తూ, వారికి నెల్లూరులోని ప్రతిష్ఠాత్మక వీఆర్ హైస్కూల్‌లో అడ్మిషన్ కల్పించి అండగా నిలిచారు.

వివరాల్లోకి వెళితే, సోమవారం నెల్లూరులోని వీఆర్ హైస్కూల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి మంత్రి లోకేశ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా, గత శనివారం తమను పాఠశాలలో చేర్పించాలని కమిషనర్‌ను కోరిన సీహెచ్ పెంచలయ్య, వి.వెంకటేశ్వర్లు అనే ఇద్దరు చిన్నారుల విషయాన్ని ఆయన దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన మంత్రి లోకేశ్, ఆ చిన్నారులిద్దరికీ అదే పాఠశాలలో అడ్మిషన్ ప్రక్రియను పూర్తి చేయించారు. వారి అడ్మిషన్ ఫారాలను స్వయంగా పాఠశాల ఏవీఓ వెంకటరమణకు అందజేశారు.
ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, "ఈ చిన్నారుల విద్యాభ్యాసానికి పూర్తిగా అండగా ఉంటాను. వారు కష్టపడి చదువుకుని, భవిష్యత్తులో ఉన్నత స్థానాలకు ఎదగాలి" అని ఆకాంక్షించారు. వారికి ఆల్ ది బెస్ట్ చెప్పినట్టు ఆయన తన సోషల్ మీడియా ఖాతా ద్వారా వెల్లడించారు. మంత్రి చూపిన చొరవతో ఆ చిన్నారుల జీవితం కొత్త మలుపు తిరిగినట్లయింది.

# చంద్రబాబు, పవన్ సమాధానం చెప్పాలి

**వైఎస్సార్ ఆర్కిటెక్చర్ వర్సిటీ విద్యార్థుల ఆందోళనకు షర్మిల మద్దతు**

అమరావతి, **జూలై7(రిపబ్లిక్ న్యూస్:-**
వైఎస్సార్ కడప జిల్లాలోని ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ విద్యార్థుల భవిష్యత్తు ప్రమాదంలో పడిందని, దీనికి గత వైసీపీ ప్రభుత్వంతో పాటు ప్రస్తుత కూటమి ప్రభుత్వం కూడా బాధ్యత వహించాలని... దీనికి సీఎం చంద్రబాబు, పవన్ కల్యాణ్ సమాధానం చెప్పాలని ఏపీసీసీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల డిమాండ్ చేశారు. వర్సిటీలో ఆందోళన చేస్తున్న విద్యార్థులకు ఆమె సోమవారం మద్దతు తెలిపి, వారి సమస్యలపై తీవ్రంగా స్పందించారు.కౌన్సిల్ ఆఫ్ ఆర్కిటెక్చర్ (సీవోఏ) నుంచి తప్పనిసరి అనుమతులు లేకుండా 2020లో విద్యార్థులను ఎలా చేర్చుకున్నారని ఆమె యూనివర్సిటీ యాజమాన్యాన్ని నిలదీశారు. "ఒక్కో విద్యార్థి సుమారు రూ.15 లక్షలు ఖర్చుపెట్టి ఐదేళ్ల కోర్సు పూర్తి చేయబోతున్నారు. ఈ సమయంలో వారి సర్టిఫికెట్లకు విలువ ఉంటుందో లేదో తెలియని పరిస్థితి నెలకొనడం అత్యంత బాధాకరం" అని షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు.ఈ సమస్యకు మాజీ ముఖ్యమంత్రి జగన్, స్థానిక ఎంపీ అవినాశ్ రెడ్డి నిర్లక్ష్యమే కారణమని ఆమె ఆరోపించారు. "అధికారంలో ఉన్నప్పుడు సీఓఏ అనుమతుల కోసం వారెందుకు ప్రయత్నించలేదు? ఢిల్లీలోనే ఉండే సీఓఏతో ఎంపీ అవినాశ్ రెడ్డి ఎందుకు మాట్లాడలేదు?" అని ఆమె ప్రశ్నించారు.అదే సమయంలో, గత ప్రభుత్వం చేసిన తప్పును సరిదిద్దాల్సిన బాధ్యత ప్రస్తుత కూటమి ప్రభుత్వంపై ఉందని షర్మిల స్పష్టం చేశారు. "కేంద్రంలో బీజేపీ అధికారంలో ఉంది. అయినా ఈ చిన్న విషయాన్ని ఎందుకు పట్టించుకోవడం లేదు? విద్యార్థుల సర్టిఫికెట్లకు విలువ లేకపోతే వారి భవిష్యత్తు ఏమిటి? అని నిలదీశారు. విద్యార్థుల సమస్యను తక్షణమే పరిష్కరించాలని కాంగ్రెస్ పార్టీ పక్షాన ప్రభుత్వాన్ని కోరుతున్నట్లు ఆమె తెలిపారు.ం

# భారత్, పాక్‌ను ఒకే త్రాసులో తూకం వేయలేం

(మొదటి పేజీ తరువాయి)

మద్దతుదారని, భారత్ ఉగ్రవాద బాధిత దేశమని ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ రెండింటినీ ఒకే త్రాసులో తూకం వేయలేమన్నారు. 'పాకిస్థాన్ ఉగ్రవాదులకు మద్దతుగా నిలుస్తోంది. భారత్ మాత్రం ఉగ్రవాద బాధితురాలిగా ఉంది. ఈ రెండింటినీ ఒకే త్రాసులో తూకం వేయలేం' అని ప్రధాని పేర్కొన్నారు. ఉగ్రవాదులకు మౌనంగా మద్దతు ఇవ్వడం కూడా ఆమోదయోగ్యం కాదని వ్యాఖ్యానించారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్రదాడిని ఖండించడంలో భారతదేశానికి మద్దతుగా నిలిచిన దేశాలకు ప్రధాని కృతజ్ఞతలు తెలిపారు. **పహల్గాం ఉగ్ర దాడిని ఖండించిన బ్రిక్స్..** బ్రెజిల్‌లోని రియో డీ జెనీరలో బ్రిక్స్ శిఖరాగ్ర సదస్సు జరుగుతోంది. ఈ సదస్సుకు ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ హాజరయ్యారు. ఈ సందర్భంగా పహల్గాం ఉగ్ర దాడిని బ్రిక్స్ దేశాలు తీవ్రంగా ఖండించాయి. ఉగ్రదాడులు ఎక్కడ జరిగినా ముక్త కంఠంతో ఖండిస్తున్నామని, టెర్రరిజం ఏ రూపంలో ఉన్న వ్యతిరేకిస్తున్నామని స్పష్టం చేశాయి. ఐక్యరాజ్య సమితి గుర్తించిన ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశాయి. ఈ మేరకు 'రియో డీ జెనీరో డిక్లరేషన్'ను సభ్యదేశాలు విడుదల చేశాయి.'ఏప్రిల్ 22న జమ్ముకశ్మీర్‌లోని పహల్గాంలో జరిగిన ఉగ్రదాడిని తీవ్రంగా ఖండిస్తున్నారు. ఉగ్రవాదం ఏ రూపంలో ఉన్నా వ్యతిరేకిస్తున్నాం. క్రాస్ బార్డర్ టెర్రరిజంతోపాటు ఉగ్రమూకలకు నిధులు అందిస్తూ, ఆశ్రయం కల్పించడాన్ని ఖండిస్తున్నారు. ఉగ్రవాదంపై పోరాటంలో కలిసికట్టుగా ముందుకు వెళ్తాం. ఐక్యరాజ్య సమితి గుర్తించిన ఉగ్రవాదులు, ఉగ్ర సంస్థల పట్ల కఠినంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాం' అని అందులో పేర్కొన్నాయి. అయితే ఈ తీర్మానంలో ఎక్కడా పాకిస్థాన్ పేరు ప్రస్తావించలేదు.

# నిరుద్యోగులను రోడ్డున పడేస్తున్న కూటమి ప్రభుత్వం...డివైఎఫ్ ఐ...

**కర్నూల్లు ప్రతినిధి జులై0 7 (రిపబ్లిక్ న్యూస్)**
కూటమి ప్రభుత్వం నిరుద్యోగులను రోడ్డు మీద పాడేస్తుందని డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర జిల్లా విమర్శించారు.సోమవారం డివైఎఫ్ఐ కర్నూల్ ఓల్డ్ సిటీ సమావేశం డివైఎఫ్ఐ మాజీ నాయకులు రామకృష్ణ అధ్యక్షతన జరిగింది.సమావేశానికి హాజరైన డివైఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు రాఘవేంద్ర, జిల్లా నాయకులు అబ్దుల్లా మాట్లాడుతూ
కూటమి ప్రభుత్వం ఏడాది పాలనలో మూడు లక్షల మంది నిరుద్యోగులను రోడ్డున పాడేసిందని ఆవేదన వ్యక్తం చేశారు.ఎన్నికల సందర్భంగా నిరుద్యోగులకు ఉద్యోగమే లక్ష్యంగా 20 లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కూటమి ప్రభుత్వం.నేడు నిరుద్యోగుల పొట్ట కొట్టే పని చేపట్టిందని అన్నారు. ఖనిజాభివృద్ధి,సంచార ఆరోగ్య శాఖ,రైస్ వాహనాల డ్రైవర్లు హెల్పర్లు,లిక్కర్ షాప్ సూపర్వైజర్లు సేల్స్ మెయిన్ లు కలిపి మూడు లక్షల ఉద్యోగాలు ఊడగొట్టిందని రేష్నలైజేషన్




పేరుతో గ్రామ వార్డు సచివాలయాల్లో 25వేల ఉద్యోగాలు ఊడదీసిందన్నారు.తొమ్మిది లక్షల కోట్ల పెట్టుబడులు ఒప్పందాలు కుదిరించుకున్న రాష్ట్ర ప్రభుత్వం మూడు లక్షల ఉద్యోగాలు అవకాశాలు వచ్చినట్లు చెబుతుందని,ఎక్కడ ఉద్యోగాలు ఇచ్చారో సమాధానం చెప్పాలని ప్రశ్నించారు.సంవత్సరకాలం పూర్తి చేసుకుని సంబరాలు చేసుకున్న రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఇస్తమన్న నిరుద్యోగ భృతి ఎందుకు ఇవ్వలేదని అన్నారు.రాష్ట్ర ప్రభుత్వం



నిరుద్యోగుల పట్ల చేస్తున్న నిర్లక్ష్యానికి వ్యతిరేకంగా యువత పోరాడాలని తెలియజేశారు. ఈనెల 11,12వ తేదీలలో జరిగే జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.
అనంతరం నూతన కమిటీని ప్రకటించారు.అధ్యక్ష కార్యదర్శులుగా అంజి,మధు,కమిటీ సభ్యులు రాజు,జుబేర్, ఇర్ఫాన్, ఖాదర్, నూరు, చంద్ర,గోపి,ఆలీ, అక్బర్,శంకర్, ఖాదర్, ఖలీల్,17మందితో ఓల్డ్ సిటీ డివైఎఫ్ఐ నూతన కమిటీ ఎన్నుకోవడం జరిగింది.

# చట్టం దృష్టిలో అందరూ సమానమే,

## చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవడం నేరం....

### ఇరు వర్గాల మధ్య ఘర్షణ, ఒకరిపై ఒకరు దాడులు...



**రామసముద్రం( రిపబ్లిక్ న్యూస్) జులై 07**
మండలంలోని నరసాపురం,ఏతూరు పల్లె గ్రామస్తుల మధ్య ఆదివారం భూ వివాద ఘర్షణ నెలకొంది.ఇరువురూ ఒకరిపై ఒకరు దాడులు చేసుకున్నారు.ఈ దాడుల్లో ఓ వర్గానికి చెందిన ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి.చట్టాన్ని చేతుల్లోకి తీసుకుని అనాలోచిత నిర్ణయాలతో చట్ట వ్యతిరేక పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఎస్సై రమేష్ బాబు స్పష్టం చేశారు.ఈ విషయమై బాదితుల ఆదివారం సాయంత్రం పోలీసుల కు పిర్యాదు చేసారు.అయితే తాము ఇచ్చిన పిర్యాదు మేరకు నిందితులపై కేసు నమోదు చేసి,వారిని అరెస్టు చేయలేదని ఆరోపిస్తూ సోమవారం ఉదయం



నరసాపురానికి చెందిన బాధిత కుటుంబాల వ్యక్తులు,గ్రామస్తులు పోలిస్ స్టేషన్ ముందు నిరసన వ్యక్తం చేశారు.దీనిపై స్పందించిన ఎస్సై ఆదివారం సాయంత్రమే నిందితులపై కేసు నమోదు చేసినట్లు ఎఫ్ ఐ అర్ కాపీ నీ చూపించడంతో బాధిత కుటుంబీకులు శాంతించారు.అయితే ఎఫ్ ఐ ఆర్ లో నిందితులపై నాన్ బెయిలబుల్ సెక్షన్ లు లేవని,ఎఫ్ ఐ అర్ మార్చాలని బాదితుల ఎస్సై ను డిమాండ్ చేశారు.ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ కేసు తీవ్రతను అనుసరించి,చట్టానికి లోబడి కేసు నమోదు చేశామని,ఎవరి ఇష్ట ప్రకారం వారికి అనుకూలంగా కేసులు ,సెక్షన్లు మార్చడం కుదరదని స్పష్టం చేశారు. ఉదయం వివాదం జరిగిన స్థలాన్ని ఎస్ఐ రమేష్ పరిశీలించారు.

# స్మార్ట్ కరెంటు మీటర్ లు వద్దు - పాత మీటర్లే ముద్దు.

## కె.సుధాకరప్పా,సీపీఎం నగర కార్యదర్శి వర్గ సభ్యులు.

**కల్లూరు ::-ప్రతినిధి జులై 7 (రిపబ్లిక్ న్యూస్)**
మా ఇంటికి పెట్టకండి...మాకు కరెంటు చార్జీల భారం వేయకండి అని సిపిఎం పార్టీ రాష్ట్ర వ్యాప్తంగా ఇచ్చిన పిలుపులో భాగంగా 32వ వార్డు ముజఫర్ నగర్ లో సిపిఎం సుందరయ్య నగర్ కార్యదర్శి ఈ రామాంజనేయులు ఆధ్వర్యంలో స్మార్ట్ మీటర్లు వద్దు - పాత మీటర్లే ముద్దు అంటూ కరపత్రాలు పంపిణీ చేస్తూ ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా సిపిఎం పార్టీ నగర కార్యదర్శి వర్గ సభ్యులు కె.సుధాకరప్ప మాట్లాడుతూ ఇప్పటికే నిత్యవసర వస్తువుల ధరలు పెరిగి ప్రజలు అల్లాడిపోతుంటే,స్మార్ట్ మీటర్ల పేరుతో ప్రజలపై భారాలు వేయడానికి ప్రభుత్వం సిద్ధం కావడం పట్ల తీవ్ర అభ్యంతరం తెలియజేశారు.గతంలో జగన్మోహన్ రెడ్డి ఆదానితో కుదుర్చుకున్న సెకి ఒప్పందాన్ని ప్రస్తుత ప్రభుత్వం రద్దు చేయకుండా ఆ ఒప్పందాన్ని అమలు



చేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు.ఇప్పటికే స్మార్ట్ మీటర్లు వ్యాపార సముదాయాలు,ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాలకు పెట్టడం వల్ల వెయ్యి రూపాయలు వచ్చే బిల్లు,మూడు వేల దాకా కరెంటు చార్జీలు అధికంగా వస్తున్నాయని ఆగ్రహం చెందారు. ప్రస్తుతం గృహాలకు కూడా స్మార్ట్ మీటర్లు పెట్టడానికి వస్తున్నారని,దీనిని ప్రతి ఒక్కరు వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు.స్మార్ట్ మీటర్ పెడితే కరెంటు చార్జీల భారం పడుతుందని, అంతేకాకుండా మూడు రకాల చార్జీలు పగలు,మధ్యాహ్నం,రాత్రి పేరుతో కరెంటు చార్జీలు పెరుగుతాయని పేర్కొన్నారు.సెల్ ఫోన్ రీఛార్జ్ చేసుకునే మాదిరిగా ఈ స్మార్ట్ మీటర్లో కూడా చిప్పు సిస్టం వస్తుందని,దానివల్ల మనకు డబ్బులు ఉంటేనే ఇంట్లో కరెంటు ఉంటుందని, లేదంటే చీకట్లో గడపాల్సి వస్తుందని చెప్పారు.ఇలాంటి మీటర్ మనకు అవసరం లేదని తెలిపారు.తమ వ్యతిరేకతను మన కరపత్రంలో వేసిన క్యూఆర్ కోడ్ ద్వారా సీఎంకు మెయిల్ ద్వారా పంపాలని వారు ప్రజలకు విజ్ఞప్తి చేశారు.ఈ కార్యక్రమంలో సిపిఎం పార్టీ నాయకులు కె.సురేష్,ఎస్.ముక్తి యార్,వి.విజయ్ కుమార్,జె.శ్రీనివాసు లు,టి.రామనాగిరెడ్డి,తదితరులు పాల్గొన్నారు.

# అందుల ప్రతిభకు అనువైన వేదికలు సిద్ధం చేయాలి

## జెసిఐ అంతర్జాతీయ కమిషన్ చైర్మన్ హర్షవర్ధన్ రెడ్డి

**తిరుపతి (అర్బన్) జూలై 7(రిపబ్లిక్ న్యూస్)**
క్రీడల్లో రాణించేందుకు అంధత్వం అడ్డుకాదని జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ - ఇండియా అంతర్జాతీయ కమిషన్ చైర్మన్ డాక్టర్ ఎన్ బి హర్షవర్ధన్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం తుమ్మలగుంట కెవిఎస్ పార్క్ లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి అంధుల క్రికెట్ పోటీల ప్రారంభం



సందర్భంగా ఆయన విశిష్ట అతిథిగా పాల్గొన్నారు. జాతీయ టెన్నిస్ క్రీడాకారుడు అయిన ఆయన మాట్లాడుతూ అంధులు అనేక రంగాలతో పాటు క్రీడల్లో రాణించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం తగిన ప్రోత్సాహం అందించాలని కోరారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా క్రికెట్ అసోసియేషన్ ఫర్ బ్లైండ్ ఇన్ ఏపీ డేవిడ్ జాన్, భారత జాతీయ అంధ క్రికెట్ జట్టు కెప్టెన్ అర్జున అవార్డు గ్రహీత అజయ్ కుమార్ రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంధులు అన్ని విధాలా సమర్థులని తెలిపారు. సరైన మార్గదర్శనం, శిక్షణ, అవసరమైన వనరులు అందితే వారు అంతర్జాతీయ స్థాయిలోనూ రాణి స్తారని చెప్పారు. క్రీడలు శక్తిని మాత్రమే కాదు, ఆత్మవిశ్వాసాన్ని కూడా పెంపొందిస్తాయన్నారు. ఈ కారణంగా అంధులకు ప్రత్యేక క్రీడా మైదానాలు, శిక్షణా కేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఆంధ్ర నుండి ఆరు జిల్లాల జట్లు ఇందులో పాల్గొంటారని తెలిపారు. ఈ క్రికెట్ టోర్నమెంట్ ద్వారా క్రీడాకారులను జాతీయ అంతర్జాతీయ స్థాయిలో వెళ్లేందుకు ఎంతో తోడ్పడుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో జూనియర్ ఛాంబర్ ఇంటర్నేషనల్ తిరుపతి శాఖ చైర్మన్ శేష సాయి, గల్ల ఫౌండేషన్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ రెడ్డి, దివ్యంగ సేవా క్షేత్రం ప్రెసిడెంట్ ముని లక్ష్మి క్రీడాకారులు పాల్గొన్నారు.

# 9 వ తారీకు కేంద్ర కార్మిక రైతు సంఘాల ఆధ్వర్యంలో

## ఓర్వకల్లులో జరిగే సమ్మెలో కార్మికులు రైతులు పాల్గొనండి

**ఓర్వకల్లు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జులై 7)**
ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న పిలుపు ఇచ్చారు, సోమవారం 9వ తారీకు కార్మిక రైతు సంఘాల ఆధ్వర్యంలో జరిగే దేశవ్యాప్త సమ్మెకు కార్మికులు రైతులు ప్రజలు పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి బి నాగన్న ఆంధ్ర ప్రదేశ్ రైతు సంఘం మండల కార్యదర్శి మధుసూదన్, ఆధ్వర్యంలో కరపత్రాల పంపిణీ కార్యక్రమం నన్నూరు ఓర్వకల్లు గ్రామాలలో నిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారాన్ని చేపట్టి 11 సంవత్సరాలు అయినా ఇంతవరకు దేశంలోని ప్రజలు రైతులు కార్మికులు ఎదుర్కొంటున్న ఏ ఒక్క సమస్య పరిష్కారం కాలేదని దానికి తోడు అనేక సంవత్సరాలుగా కార్మికులు పోరాడే సాధించుకున్న హక్కులను కాలరాస్తూ నాలుగు లేబర్ కోడ్లను తెచ్చాడని రైతాందానికి వ్యతిరేకంగా మూడు వ్యవసాయ నల్ల చట్టాన్ని తీసుకొచ్చి కార్పొరేట్ శక్తులకు బడా కంపెనీలకు మేలు చేకూర్చే విధానాన్ని అమలు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు మరియు ప్రధానినరేంద్ర మోడీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత దేశంలో అనేకచోట్ల మత ఘర్షణలు కుల వివక్ష విభజన రాజకీయాలు విపరీతంగా పెరిగిపోయావని విమర్శించారు ఎన్నికల ముందు రైతులకు కార్మికులకు నిరుద్యోగులకు ప్రజలకు అనేక వాగ్దానాలు చేసి అధికారంలోకి




వచ్చాక ఏ ఒక్క హామీ అమలు చేయకుండా మత విద్వేషాలు రెచ్చగొట్టి అధికారాన్ని చేయపడుతున్నారని విమర్శించారు ఆంధ్ర రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా ప ప్యాకేజీ ఇవ్వకుండా వెనుకబడ్డ జిల్లాలకు నిధులు ఇవ్వకుండా తీవ్ర అన్నయ్య చేశారని విమర్శించారు ఇప్పటికైనా ప్రధానినరేంద్ర మోడీ ప్రభుత్వం ప్రజలు రైతులు కార్మికులు నిరుద్యోగులు ప్రయోజనాల కోసం నాలుగు లేబర్ కోడ్లను రద్దుచేసి రైతులు పండించిన పంటలకు మద్దతు ధర కల్పించి పెరుగుతున్న నిత్యవసర సరుకుల ధరలు తగ్గించాలని నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు లేని పక్షంలో ప్రజలు రైతులు కార్మికులు నిరుద్యోగులు ప్రధాని నరేంద్ర మోడీ ప్రభుత్వానికి తగిన బుద్ధి చెబుతారని అన్నారు ఈ కార్యక్రమంలో డివై ఎఫ్ఐ నాయకులు ,మహేష్, వెంకటేశ్వర్లు, మధు తదితరులు పాల్గొన్నారు

# శ్రీ కపిలేశ్వరాలయంలో వైభవంగా పవిత్రోత్సవాలు





**తిరుపతి జూలై 7(రిపబ్లిక్ న్యూస్)** తిరుపతి శ్రీ కపిలేశ్వరస్వామివారి ఆలయంలో పవిత్రోత్సవాలలో భాగంగా జూలై 07న సోమవారం ఉదయం నుండి శాస్త్రోక్తంగా కైంకర్యాలు నిర్వహించారు. ఉదయం సుప్రభాతం, అభిషేకం, అలంకారం, అర్చన, నివేదన చేపట్టారు. ఉదయం 09.00 - 10.00 గం.ల వరకు పంచమూర్తుల ఉచ్చవర్లకు స్నపనతిరుమంజనం, అలంకారం నిర్వహించారు.సాయంత్రం కలశ స్థాపనం, కలశ పూజ, అగ్ని కార్యం, హెూమం, లఘు పూర్ణాహూతి, గ్రంధి పవిత్ర ప్రతిష్ట నిర్వహించారు.ద

# ప్రభుత్వ ప్రైవేట్ పాఠశాలల ఉపాధ్యాయుల సమావేశము



**ఓర్వకులు ప్రతినిధి (రిపబ్లిక్ న్యూస్ జులై 7)** ఓర్వకల్లు మండలంలో ఉన్న గ్రామాల ప్రభుత్వ పాఠశాల, ప్రైవేట్ పాఠశాల ప్రధాన ఉపాధ్యాయుల కు ఎంపీడీవో ఓర్వకల్లు నందు సమావేశం ఏర్పాటు చేయడం జరిగింది. ఈ సమావేశము నందు ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంఈఓ ఓంకార్ యాదవ్, శ్రీధర్ బాబు పాల్గొనడం జరిగింది ఈ సమావేశానికి ఎంఈఓ ఓంకార్ యాదవ్, అధ్యక్షతన వహించి 10-07-2025 న జరుగు మెగా ప్రభుత్వం పాఠశాలు పైరేటెడ్ ఉపాధ్యాయులు మీటింగ్ కు సంబంధించిన సంసిద్ధత గురించి తెలియజేయడం జరిగింది, ప్రతి పాఠశాల వారు ఎల్ ఈ ఏపీ ఏపిపి నందు వి టైస్ రిజిస్ట్రేషన్ పి ఐ ఏ ఎన్ టి ఎస్ రిజిస్ట్రేషన్ తప్పక చేయాలని తెలియజేశారు 10 వ తేదీ జరుగు మెగా షెడ్యూల్ ప్రకారం నిర్వహించాలి ఫోటోలు అప్లోడ్ చేయాలి తెలియజేశారు ఈ సమావేశానికి స్థానిక ప్రజా ప్రతినిధులు ఆహ్వానించా లని తెలిపారు ఉపాధ్యాయులు విద్యార్థుల ఆహ్వానించారు హాజరు సకాలంలో నమోదు చేయాలని సూచించారు, ఈ సమావేశం ఉద్దేశించి ఎంపీడీవో మాట్లాడుతూ 10-07-2025 న జరగబోవు మెగా పేరెంట్ టీచర్ మీటింగ్ ను గిన్నిస్ బుక్ రికార్డ్స్ లో నమోదు అయ్యేలాగా విజయం చేయాలని తెలిపారు ఈ సమావేశంలో మండలంలోని వివిధ పాఠశాలల ఉపాధ్యాయులు ఎం ఐస్, డిటిపి, సి ఆర్ ఎం టీలు పాల్గొనడం జరిగింది

# గ్రేడ్ 3 ఏఎన్ఎమ్ లకు బదిలీల

## నియామక పత్రాలను అందజేయాలి

### రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. రజినీ





**ఉమ్మడి అనంతపురం జిల్లా, ప్రతినిధి, జులై 07, ( రిపబ్లిక్ న్యూస్ ):**
ఉమ్మడి అనంతపురం జిల్లాలో జి ఎస్ డబ్ల్యూ గ్రేట్ 3 ఏ ఎన్ ఎమ్ లకు జూన్ 30 న వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించారు. కౌన్సిలింగ్ నిర్వహించి దాదాపు వారం రోజులు అవుతున్నా ఇప్పటివరకు సచివాలయం గ్రేడ్ 3 ఏ ఎన్ ఎమ్ లకు బదలీ ఆర్డర్స్ ఇవ్వలేదని రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్. రజిని పేర్కొన్నారు. శింగనమల నియోజకవర్గంలోని పామిడిలో జె.పి ఫంక్షన్ హాల్ లో సోమవారం జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ వి. ఐఏఎస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక ను నిర్వహించారు. అనంతరం
బదిలీల వెకెన్సీల్లో పారదర్శకత లోపించడం, సీనియార్టీ ఆర్డర్ ప్రకారం నిర్వహించకుండా కొందరి విషయాలలో జాప్యం చేయడం, తదితర అంశాల నేపథ్యంలో తమకి బదిలీల్లో అన్యాయం జరిగిందని సచివాలయ గ్రేడ్ 3 ఏ ఎన్ ఎమ్ లతో కలిసి ఎస్. రజిని కలెక్టర్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ పత్రికా విలేకరులతో మాట్లాడుతూ ...ఉమ్మడి అనంతపురం జిల్లాలో వెబ్ కౌన్సిలింగ్ నిర్వహించిన గ్రేట్ 3 సచివాలయ ఏఎన్ఎం లకు బదిలీ ఆర్డర్స్ ను ఇవ్వకుండా వైద్య ఆరోగ్యశాఖ అధికారి తమను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కౌన్సిలింగ్ జరిగి దాదాపు వారం రోజులు కావస్తున్న అధికారులలో చలనం లేకపోవడం గమనార్హం అని. అన్నారు. వైద్య ఆరోగ్యశాఖ అధికారులు రీ కౌన్సిలింగ్ పేరిట తమను మభ్యపెడుతూ కాలం గడిపేస్తున్నారన్నారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా దాదాపుగా వెయ్యి మందికి పైగా సచివాలయ ఏఎన్ఎంలు సక్రమంగా విధులు నిర్వహిస్తున్నారన్నారు. అయితే తమకు ర్యాంకుల ప్రకారం ఉద్యోగ బదిలీల్లో తమకు అన్యాయం జరిగిందని వాటిని కప్పిపుచ్చేందుకే మళ్లీ రీ కౌన్సిలింగ్ పేరిట ఏఎన్ఎం లను అధికారులు భయాందోళనకు గురి చేస్తున్నారన్నారు. రీ కౌన్సిలింగ్ నిర్వహించిన అధికారులు తమకు వెంటనే ఆర్డర్స్ ఇచ్చి విధులలోకి చేర్చాలని తెలిపారు.
సచివాలయాలలో పనిచేసే గ్రేట్ 3 ఏఎన్ఎం లు వైద్య ఆరోగ్య శాఖ పరిధిలో ఉన్న ఎం పి హెచ్ ఏ ఎఫ్ గా ప్రమోషన్ పొందిన వారిని తిరిగి గ్రేడ్ 3 ఏ ఎన్ ఎం పోస్టులలో నియమించడం జరిగిందన్నారు.
అయితే ప్రమోషన్ పొందిన ఎం పి హెచ్ ఏ ఎఫ్ ను అదే స్థానంలో ఉంచడమనడం సమంజసం కాదని తెలియజేశారు. ప్రమోషన్ పొందిన వారిని అదే స్థానంలో ఉంచడం చట్ట విరుద్ధమన్నారు. వాటి వల్ల తమకు అన్యాయం జరుగుతుందని , నష్టం జరుగుతుందని అధికారులు వీటిపై దృష్టి పెట్టి లోపాలను సరిచేయాలన్నారు. అధికారుల నిర్లక్ష్యం వల్లే తమకు అన్యాయం జరిగిందని వాపోయారు. తాము సచివాలయ ఏఎన్ఎమ్ లుగా మెడికల్ ఏఎన్ఎమ్ లుగా విధులను నిర్వహిస్తూ ఒకే సచివాలయ ఏఎన్ఎమ్ లు ఇద్దరి అధికారుల దగ్గర పని చేయాల్సి ఉందన్నారు .
వీటివల్ల పని భారం పెరగడమే కాక పని ఒత్తిడి పెరగడంతో విధులను సక్రమంగా నిర్వర్తించలేక పోతున్నామని
తమ ఆవేదనను పై అధికారులు అర్థం చేసుకోవాలన్నారు.
సచివాలయ ఏఎన్ఎమ్ ఉద్యోగులు ఒకే విధినిర్వహణలో రెండు డ్యూటీలను చేయడం వలన పని ఒత్తిళ్లు పెరిగి, పని భారంగా మిగిలి తమని సమస్యల్లోకి నెట్టే విధంగా ఉందన్నారు. అందులో భాగంగానే ఎం పి హెచ్ ఏ ఎఫ్ వారిని వారి సొంత సబ్ సెంటర్లకు నియమించే విధంగా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. వారి రీ డిప్లమెంట్ ను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కేవలం సచివాలయ పోస్టులకు మాత్రమే కౌన్సిలింగ్ నిర్వహించారన్నారు . జిల్లా వైద్యాధికారి, జిల్లా కలెక్టర్ లు తక్షణం స్పందించి తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. తమకు న్యాయం జరగను పక్షాన జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు న్యాయ పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో
గౌతమి, సోమలత, నర్మద, లక్ష్మి, రాజేశ్వరి, నాగలక్ష్మి, రమ, సుగుణ దేవి, గౌతమి, మార్తమ్మ, మహేశ్వరి, జయలక్ష్మి, నాగ మునేశ్వరి, తమయంతి, సలీమా తదితరులు పాల్గొన్నారు. గ్రేడ్ 3 ఏఎన్ఎమ్ లు జిల్లా కలెక్టర్ వినోద్ కుమార్ వి. ఐఏఎస్ కు వినతి పత్రం అందజేశారు.

ప్రజా రిపబ్లిక్
ప్రతి అక్షరం ప్రజల కోసం



# ఏడాది పాలనలోనే రాష్ట్రం అభివృద్ధి పథం

## సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నాం

## P4 తో పేదరిక నిర్మూలనే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు లక్ష్యం

**ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రతినిధి, జులై 7 (రిపబ్లిక్ న్యూస్)**
వైసిపి ఐదేళ్ల పాలనలో జరగని అభివృద్ధి, సంక్షేమం కూటమి ఏడాది పాలనలోనే చేశామని ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య అన్నారు. సోమవారం జగ్గయ్యపేట పట్టణంలో 9వ వార్డు సీతారామపురంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య), నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరామ్ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంచుతూ ఏడాదిలో కూటమి ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా వార్డులోని ప్రజలు సీసీ రోడ్లు, డ్రైనేజీ, వీధిలైట్లు, ఇళ్ల పట్టాలు వంటి సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని వారికి హామీ ఇచ్చారు.



ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన మాట ప్రకారం సూపర్ సిక్స్ హామీలన్నీ అమలు చేస్తున్నాం. పింఛన్ రూ.1000 పెంచడానికి జగన్మోహన్ రెడ్డికి ఐదేళ్లు పడితే చంద్రబాబునాయుడు అధికారం లోకి రాగానే ఒక్క సంతకంతో పింఛను రూ.4000 వేలకు పెంచారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా తల్లికి వందనం ఇచ్చాం, మహిళలకు ఉచితంగా ఏడాదికి మూడు గ్యాస్ సిలిండర్లు ఇస్తున్నాం, ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పించబోతు న్నాం. ఈ నెలలోనే రైతులకు అన్నదాత సుఖీభవ అందజే స్తాం, మెగా డీఎస్సీతో 13 వేల టీచర్ ఉద్యోగాలు భర్తీ చేసాం. కానీ జగన్ మోహన్ రెడ్డి గత ఐదేళ్ల పాలనలో కనీసం ఒక్క టీచరు పోస్టు భర్తీ చేసిన పాపాన పోలేదు. చంద్రబాబు అన్న క్యాంటీన్ తో పేదల ఆకలి తీర్చితే జగన్మోహన్ రెడ్డి అన్న క్యాంటీన్ రద్దు చేసి పేదల కడుపు కొట్టారు. చంద్రబాబు అధికారంలోకి రాగానే అన్న క్యాంటీన్లు ప్రారంభించి పేదల ఆకలి తీరుస్తున్నారన్నారు. %ా%4 తో రాష్ట్రంలో పేదరికం లేకుండా చేయాలన్న లక్ష్యంతో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు పనిచేస్తున్నారని అన్నారు. ఈ కార్యక్రమంలో మేక వెంకటేశ్వర్లు, మైనేని రాధాకృష్ణ, ఎలమంచిలి రాఘవ, గింజుపల్లి రమేష్, కౌన్సిలర్లు పేరం సైదేశ్వర రావు, ఇర్రి నరసింహారావు, గొట్టే నాగరాజు, నకిరకంటి వెంకట్ నాయకులు కొఠారు సత్యనారాయణ ప్రసాద్, మీసాల చిట్టిబాబు, బొల్లెపల్లి భోజరాజు, సూర్యదేవర రాంప్రసాద్, వేదులపురి సైదా, మల్లెల కొండయ్య, కటికల అనిల్, కర్ల జోజి, దువ్వల రామకృష్ణ, మన్నె నారాయణ రావు, సీలం లక్ష్మయ్య, మైల రమణారెడ్డి, పటాపంచుల తిరపారావు, షేక్ ఖాసిం, షేక్ అక్బర్, తోట నాగేశ్వరరావు, తాటి రామారావు, సూర సతీష్, గాలం శ్రీను, షేక్ షరీఫ్, భూక్య బద్యా నాయక్, జవ్వాజి రామకృష్ణ, షేక్ మౌలాలి, గింజుపల్లి కృష్ణ, కోట ప్రభోజీ తదితరులు పాల్గొన్నారు.

# రిసోర్స్ పర్సన్స్ కాలపరిమితి పెంచిన సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు కు పాలాభిషేకం



**ఎన్టీఆర్ జిల్లా నందిగామ ప్రతినిధి, జులై 7 (రిపబ్లిక్ న్యూస్)**
నందిగామ పురపాలక సంఘ కార్యాలయం నందు మెప్మా సంస్థల ఆధ్వర్యంలో రిసోర్స్ పర్సన్స్ కాలపరిమితి పెంచిన కారణముగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడుకి, ప్రభుత్వ విప్ స్థానిక శాసన సభ్యురాలు తంగిరాల సౌమ్య ఆదేశాలతో పాలాభిషేకం కార్యక్రమాన్ని నిర్వహించిన నందిగామ మున్సిపల్ చైర్ పర్సన్ మండవ కృష్ణకుమారి. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమంలో చైర్పర్సన్ మాట్లాడుతూ మహిళ సాధికారిత కోసం ఎల్లప్పుడూ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని మహిళలకు ఆర్థిక అసమానతలను దూరం చేస్తూ వారికి సహాయక సంఘాల ద్వారా చేయూతనిస్తూ వారి అభివృద్ధికి పాటుపడే దిశగా కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ జి లోవరాజు, ఏ ఈ ఫణి శ్రీనివాస్, పట్టణ పార్టీ అధ్యక్షులు ఏచూరి రాము, మెప్మా సీఎంఏంఎం సత్యవతి, సి ఓ లు, ఆర్పీలు, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# యువతకు ఉద్యోగావకాశాల కల్పనకు జాబ్‌మేళాలు నిర్వహించండి.

## ఉపాధి అవకాశాలు పొందేలా యువతకు శిక్షణ అందించండి

## జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ.

**ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రతినిధి, జులై 7 (రిపబ్లిక్ న్యూస్)**
నిరుద్యోగ యువతకు నైపుణ్య శిక్షణ అందించి ఉద్యోగ అవకాశాలు పొందేలా జాబ్ మేళాలను నిర్వహించాలని జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ ఉపాధి శిక్షణ శాఖ అధికారుల కు సూచించారు. స్వర్ణాంధ్ర 2047 దార్శనిక ప్రణాళికకు అనుగుణంగా దశల వారీ లక్ష్యాలను సాధించేందుకు కలెక్టరేట్ ప్రాంగణంలో జిల్లా ఉపాధి శిక్షణ శాఖ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇగ్నైట్ సెల్‌ను కలెక్టర్ డా.జి.లక్ష్మీశ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిరుద్యో గ యువతకు మెరుగైన ఉద్యోగా వకాశాలను కల్పించేందుకు జాబ్‌మేళాలను నిర్వహించాల న్నారు. అవసరమైన వారికి నైపుణ్య శిక్షణను అందించేందు కు చర్యలు తీసుకోవాలన్నారు. జాబ్ మేళాను యువత సద్వినియోగం చేసుకునేలా విస్తృత పచారం కల్పించాల న్నారు. యువతకు సుస్థిర ఉద్యోగ అవకాశాలను కల్పించేందుకు ఈ ఏడాది ఇప్పటి వరకు 53 జాబ్ మేళాలను నిర్వహించి సుమారు 900 మందికి పైగా ఉపాధి అవకాశాలను కల్పించడం అభినందనీయ మన్నారు. పదోవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బీటెక్, పీజీ పూర్తిచేసి అర్హత కలిగిన వారికి ఉద్యోగ అవకాశా లను కల్పించేందుకు ఈ నెలలో మెగా జాబ్‌మేళాను నిర్వహిం చేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు. ఇగ్నైట్ సెల్ సందర్శనలో జిల్లా కలెక్టర్ వెంట జిల్లా ఉపాధి కల్పన అధికారి సి. మధుభూషణ్‌రావు, ఉపాధి కల్పన అధికారి (ఒకేషనల్ అండ్ గైడెన్స్) వైఎస్ బ్రహ్మం, జిల్లా స్కిల్ డవలప్‌మెంట్ అధికారి ఎస్ శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు.




# భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) నందిగామ మండల కమిటీ

- **ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టళ్ల బాట పట్టిన (ఎస్ఎఫ్ఐ)**
- **మెస్ బిల్లులు రాక అనేక ఇబ్బందులు పడుతున్నా హాస్టల్ వార్డెన్స్,ప్రభుత్వం హాస్టల్ కు నిధులు ఇవ్వకపోవడం వల్ల సొంత డబ్బులుతో నిర్వహణ**
- **పెరిగిన ధరలకు అనుగుణంగా విద్యార్థులుకు మెస్,కాస్మోటిక్ చార్జీలు పెంచాలి.**
- **కాలేజీ హాస్టల్స్ కు సొంత భవనాలు వెంటనే నిర్మించాలి**
- **నాడు - నేడు ద్వారా హాస్టల్ అభివృద్ధి చేయాలి.**

**ఎస్ఎఫ్ఐ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు గోపినాయక్ డిమాండ్**

**ఎన్టీఆర్ జిల్లా నందిగామ ప్రతినిధి, జులై 7 (రిపబ్లిక్ న్యూస్)**
సంక్షేమ హాస్టల్ విద్యార్థులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఎన్టీఆర్ జిల్లా వ్యాప్తంగా సంక్షేమ హాస్టల్ బాట కార్యక్రమంలో భాగంగా నందిగామ నియోజకవర్గంలో వీరులపాడు, నందిగామ, కంచికచర్ల బాలురు వసతి గృహం, నందిగామ పట్టణంలో ఉన్నా ఎస్.సి సాంఘిక సంక్షేమ బాలురు వసతి గృహాన్ని, ఎస్ఎఫ్ఐ నాయకులు పరిశీలించి విద్యార్థులుతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకు న్నారు. ఈ సందర్భం గా SFI ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షు డు గోపి నాయక్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత ప్రభుత్వం హాస్టల్ విద్యార్థులకు సరైన సదుపాయా లు, నిధులు మంజూరు చేయక పోవడం, సదుపాయాలు కల్పించకపోవ డం దారుణమని అన్నారు. ఇప్పటికీ నిత్యవసర సరుకుల ధరలు ఆకాశాన్ని అందుతుంటే రోజుకు విద్యార్థు లకు నాణ్యమై న భోజనం ఎలా లభిస్తుందని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. తక్షణమే పెరిగిన ధరలకు అనుగుణంగా మెస్, కాస్మోటిక్ చార్జీలు పెంచాలని, సంక్షేమ హాస్టల్లో మౌలిక సదుపాయాలు కల్పిం చాలని డిమాండ్ చేశారు. నాడు – నేడు ద్వారా హాస్టల్స్ అభివృద్ధి చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యార్థుల తో కలిసి భోజనం పరిశీలించా రు. ఈ కార్యక్రమంలో నందిగామ నాయకులు రవి,హుస్సేన్, తదితరులు పాల్గొన్నారు.



# నందిగామ మున్సిపల్ కార్యాల యం ఎదుట 3వ రోజు కార్మికలు పనిచేసే పనిముట్లతో నిరసన




**ఎన్టీఆర్ జిల్లా నందిగామ ప్రతినిధి, జులై 7 (రిపబ్లిక్ న్యూస్):** సిఐటియు ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి కె.గోపాల్ మాట్లాడుతూ ఇంజనీరింగ్ కార్మికుల్లో సమ్మెకు సిపిఎం పార్టీ నాయకులు వల్లూరు రవి శేఖర్, ఎం శ్రీనివాస్ మద్దతు తెలియజేశారు. ఇంజనీరింగ్ కార్మికులందరికీ జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలి. కార్మికులందరికీ సంక్షేమ పథకాలు అమలు చేయాలి. ఇంజనీరింగ్ కార్మికులకు వయోపరిమితి 62 సంవత్సరాల పెంచాలి. ఇంజనీరింగ్ కార్మికులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ కల్పించాలి. ఇంజనీరింగ్ కార్మికులు ప్రమాదం జరిగితే ప్రమాద భీమా సౌకర్యం కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 12వ తారీకు లోపు ఇంజనీరింగ్ కార్మికుల సమస్యల పరిష్కరించక పోతే 12వ తేదీ అర్ధరాత్రి నుండి సమ్మె బాట పట్టడం జరిగిందని తెలియజేయడం జరిగింది. ఈకార్యక్రమంలో మున్సిపల్ నాయకులు పరిమి రవి అధ్యక్షులు, కార్యదర్శి శ్రావణ్ కుమార్, కోశాధికారి కండెల శీను, సహాయ కార్యదర్శి దారెల్లి అశోక్, బ్రహ్మం, వంశీ, దాసు, రవి, తదితరులు పాల్గొన్నారు.

# జగన్‌కు దేవినేని ఉమా స్ట్రాంగ్ వార్నింగ్

## చిల్లర రాజకీయాలు చేస్తే ప్రజలు తరిమి కొడతారు

**ఎన్టీఆర్ జిల్లా విజయవాడ రూరల్ (గొల్లపూడి) ప్రతినిధి, జులై 7 (రిపబ్లిక్ న్యూస్)**
వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై టీడీపీ నేత మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వర రావు తీవ్ర విమర్శలు గుప్పించారు. చిల్లర రాజకీయాలు చేస్తే ప్రజలు తరిమి కొడతారని జగన్‌కు హెచ్చరికలు జారీ చేశారు. సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమంలో భాగంగా ఆయన గొల్లపూడి గ్రామంలో (కార్తికేయ టవర్స్,అభినందన అపార్ట్మెంట్) ప్రజలను కలిసి, కూటమి ప్రభుత్వ సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, జగన్ ఐదేళ్ల పాలనలో రాష్ట్రం లో ఎలాంటి అభివృద్ధి చేయలే దని, కానీ కూటమి ప్రభుత్వం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఒక్క ఏడాదిలోనే అద్భుతమైన అభివృద్ధిని సాధించిందని ఆయన అన్నారు. జగన్ బెయిల్‌పై ఉన్న ముద్దాయిగా ఉంటూ చట్టాలను బెదిరించేలా బరితెగించిన చర్యలకు పాల్ప డుతున్నారని ఆరోపించారు. "జగన్ తండ్రి హయాంలో మా మీద పెట్టిన కేసుల కారణంగా మేము ఇప్పటికీ వాయిదాల కోసం కోర్టుల చుట్టూ తిరుగు తున్నామన్నారు. పోలీసు, న్యాయ వ్యవస్థలను జగన్ రెడ్డిపై ఉన్న కేసులను త్వరిత గతిన విచారించాలి" అని తెలిపారు. జగన్‌ను పిరికి వ్యక్తిగా అభివర్ణిస్తూ, "అసెంబ్లీకి కూడా రాలేని జగన్ రెడ్డి ప్రతిపక్ష నాయకుడిగా కూడా పనికిరాడ న్నారు. ప్రజాస్వామ్యాన్ని, కోర్టులను గౌరవించని వ్యక్తి ఆయన" అని విమర్శించారు. జగన్ వ్యూహకర్తలపై కూడా ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. "జగన్ వ్యూహకర్తలు ఎవరు? అన్నం తింటున్నారా, గడ్డి తింటున్నారా? రాష్ట్రాన్ని ఒక్క ఛాన్స్ అని తగలబెట్టిన వైసీపీ, మళ్లీ సింగయ్య శవం మీద పేలాలు ఏరుకోవాలని చూస్తోందా?" అని ప్రశ్నించారు. ప్రజలు వైసీపీని 11 సీట్లకు పరిమితం చేశారని, రాష్ట్రాన్ని మళ్లీ అస్థిరత్వంలోకి నెట్టే కుట్రలు చేస్తే ప్రజలు తిరస్కరిస్తారని దేవినేని హెచ్చరించారు. "మా రాష్ట్రాన్ని ఏం చేద్దామను కుంటున్నారు? ప్రజలుమిమ్మల్ని తన్ని తరిమేస్తారు" అని ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమం లో స్థానిక నేతలు పాల్గొన్నారు.





# చిన్నారులను ఆశీర్వదించిన మొండితోక జగన్మోహనరావు

**ఎన్టీఆర్ జిల్లా నందిగామ ప్రతినిధి, జులై 7 (రిపబ్లిక్ న్యూస్):** నందిగామ పట్టణం రామన్నపేట రోడ్డు బాలాజీ ఫంక్షన్ హాల్ లో 13వ వార్డు వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు KT వెంకటేశ్వ రరావు కుమార్తెల నూతన వస్త్ర బహుకరణ వేడుకకు నందిగామ మాజీ శాసనసభ్యులు డాక్టర్ మొండితోక జగన్మోహనరావు పార్టీ నాయకులతో కలిసి హాజరై చిన్నారులను ఆశీర్వదించి వారి కుటుంబ సభ్యులకు శుభాకాంక్షలు తెలియజేశారు.



# సోమవారం పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ కార్యక్రమంలో వచ్చిన అర్జీలు

**ఎన్టీఆర్ జిల్లా నందిగామ ప్రతినిధి, జులై 7 (రిపబ్లిక్ న్యూస్)**
నందిగామ రెవెన్యూ డివిజనల్ అధికారి (కె. బాలకృష్ణ ఆధ్వర్యంలో పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టమ్ (కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో మొత్తం 16 అర్జీలు నమోదు అయ్యాయి. విభాగాల వారీగా అర్జీల వివరాలు ఇలా ఉన్నాయి:రెవెన్యూ విభాగం – 5సర్వే విభాగం – 4పోలీసు విభాగం – 3ఎలక్ట్రికల్ విభాగం – 1సివిల్ సప్లయ్ విభాగం – 1పంచాయతీ రాజ్ విభాగం – 1ఎడ్యుకేషన్ విభాగం– 1అర్జీలు సకాలంలో పరిష్కరించేం దుకు సంబంధిత అధికారులకు సూచనలు జారీ చేశారు.

# సమయపాలన పాటించకుంటే సస్పెన్షన్

**- గ్రీవెన్స్ హాల్ డోర్లు ఉదయం 9.30కల్లా బంద్ చేయండి - ఆలస్యంగా వచ్చే జిల్లా అధికారులపై వేటు తప్పదు**
**- సమయపాలనే అధికారుల పనితీరుకు గీటురాయి - జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ**

**ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ప్రతినిధి, జులై 7 (రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) సమావేశానికి జిల్లా అధికారులు సమయపాలన పాటించకుంటే సస్పెన్షన్ చేసేందుకు వెనుకాడ బోమని, ఉదయం 9.30 గంటల కల్లా గ్రీవెన్స్ హాల్‌కు జిల్ల అధికా రులు చేరుకోవాలని, ఆలస్యమై తే వేటు తప్పదని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ హెచ్చరించారు.
జిల్లా కలెక్టరేట్‌లో ప్రతి సోమవా రం నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక గ్రీవెన్స్ హాల్ అయిన పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో జిల్లా అధికారులకు కలెక్టర్ నుంచి ఊహించని సంఘటన ఎదురైంది. జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లాస్థాయి గ్రీవెన్స్‌కు ఉదయం 9.30 గంటలకు హాజరుకావాల ని జిల్లా రెవెన్యూ అధికారి నుంచి అధికారులకు సమాచా రం అందుతుంది. ఈ సమాచా రం మేరకు ఉదయం 9.30 గంటలకు జిల్లా కలెక్టర్ లక్ష్మీశ గ్రీవెన్స్ హాల్‌కు చేరుకున్నారు. కొందరు అధికారులు సమావేశా నికి ఆలస్యంగా రావడాన్ని గమనించిన జిల్లా కలెక్టర్ లక్ష్మీశ ఒకింత అసహనానికి గురై ఆలస్యంగా చేరుకున్న అధికారు లకు తుది హెచ్చరికలు జారీ చేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజల సమస్యలను సత్వరమే పరిష్కరించాలనే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ప్రజా సమస్యల పరిష్కార వేదికను నిర్వహిస్తోం దన్నారు. ప్రజల నుంచి స్వీకరిం చిన అర్జీలకు సంబంధించి సమీక్షను నిర్వహించి మరింత పారదర్శకతతో పాటు అర్జీల పరిష్కారంలో ఎదురయ్యే సమస్యలపై సమీక్షించి పరిష్కారం చూపేందుకు 9.30 గంటలకల్లా గ్రీవెన్స్‌కు హాజరు కావాలని పంపిన సమాచారాన్ని కొందరు జిల్లా అధికారులు బేఖాతరు చేయడం విధులపట్ల అలసత్వం ప్రదర్శిస్తున్నట్లు భావించాల్సి వస్తోందన్నారు. ఇకపై ఇలాంటి వాటిని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోన న్నారు. 9.30 గంటలకు గ్రీవెన్స్ హాల్ డోర్లు మూసివేయాలని సంబంధిత సిబ్బందికి కలెక్టర్ హుకుం జారీచేశారు. 10 గంటల కల్లా హాజరుపట్టికను తమ ముందు ఉంచాలని. ముందస్తు అనుమతి లేకుండా ఆలస్యంగా వచ్చినా, గైర్హాజరైనా అధికారు లను సస్పెండ్ చేయడం జరుగు తుందన్నారు. సమయపాలన అధికారుల పనితీరుకు కొలమా నమని అన్నారు. టీమ్ ఎన్‌టీఆర్ స్ఫూర్తితో జిల్లా అభివృద్ధికి, ప్రజా సమస్యల పరిష్కారంలోనూ జిల్లాను అగ్రగామిగా నిలపడం ప్రతిఒక్కరి కర్తవ్యంగా భావించాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు.



### 138 అర్జీల స్వీకరణ:

రెవెన్యూ శాఖకు సంబంధించి 53, పోలీస్ 23, ఎంఏయుడి 17, పౌరసరఫరాలు 6, హెల్త్ 6, పంచాయతీరాజ్ 6, కలెక్టరేట్ విద్య 3, డిఆర్‌డిఏ 3, వ్యవసాయం 2, డ్వామా 2, విద్య 2, పోల్యూషన్ కంట్రోల్ బోర్డు 2, సర్వే 2, ఏపిసిపిడిసిఎల్, ఏపిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్, విభిన్నప్రతిభావంతులు, అగ్నిమాపకాలు, కెడిసిసి బ్యాంకు, ఎల్‌డిఎం, గనులు మరియు భూగర్భ, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంపులు, ఆర్ఐవో, ఆర్‌డబ్ల్యుఎస్, రవాణా కు సంబంధించి ఒక్కొక్క అర్జీతో కలిపి మొత్తం 138 అర్జీలు స్వీకరించిన్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి. లక్ష్మీశ తెలిపారు.

# తథాగాతుడు గౌతమ బుద్ధుని తల నరికిన ఉన్మాద ఉద్ఘటనపై
# రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేయాలి

### - తిరుపతి కలెక్టరేట్లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ఫిర్యాదు
### -బాస్ రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు

**తిరుపతి (రిపబ్లిక్ న్యూస్ )జూలై 7**
కుల వివక్షతో బౌద్ధవులను అవమానించి దురుసు ప్రవర్తనతో దళిత నేతల్ని గాయపరిచి బాధితులపై తప్పుడు కేసులు నమోదు చేయించి అప్రజాస్వామికంగా వ్యవహరించిన అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పై విచారణకు ఆదేశాలు ఇచ్చి, తగు చర్యలు తీసుకోవాలితథాగాదుడు గౌతమ బుద్ధుని తల నరికిన ఉన్మాద దుర్ఘటనపై విచారణకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేసి,కుల వివక్షతో బౌద్ధవులను అవమానించి- దురుసు ప్రవర్తనతో దళిత నేతలు గాయపరిచి- బాధితులపై తప్పుడు కేసులు నమోదు చేయించి అప్రజాస్వామికంగా వ్యవహరించిన అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు మీద రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని నేడు తిరుపతి కలెక్టరేట్లో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో భారతీయ అంబేద్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షులు పాలకుంట శ్రీనివాసులు ,రాష్ట్ర కార్యదర్శి మల్లారపు వాసు లు జిల్లా డిప్యూటీ కలెక్టర్ రోజా రాణి గారికి వినతిపత్రం అందజేశారు. అనంతరం పాలకుంట శ్రీనివాసులు, మల్లెమొగ్గలు ఉమాపతి మాట్లాడుతూ మదనపల్లి లో బుద్ధుని కొండ మీద గల బుద్ధ భగవాన్



తలను నరికిన అసాంఘిక శక్తులను గుర్తించి అరెస్టు చేయాలని మదనపల్లి లో శాంతియుత నిరసన దీక్ష చేపట్టిన భారతీయ అంబేద్కర్ సేన వ్యవస్థాపకులు పిటిఎం శివప్రసాద్ గారిని అరెస్టు చేసి, పోలీసు స్టేషన్లో నిర్బంధించి అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు ఆదేశాలతో భౌతికంగా దాడి చేసి గాయపరిచి అక్రమ కేసులు బనాయించడం చాలా హేయమైన చర్య అని ,అన్నమయ్య జిల్లాలో ఎస్పీ విద్యాసాగర్ నాయుడు పౌర హక్కుల్ని గాలికి వదిలేసి తన సొంత రాజ్యాంగాన్ని అమలు చేస్తూ అన్యాయాన్ని ప్రశ్నించిన అనేకమంది ఉద్యమకారుల పట్ల కుల అహంకార భావంతో అక్రమ కేసులు కట్టించిన ఘనత విద్యాసాగర్ నాయుడుకే దక్కుతుందని, ఏ జిల్లాలో లేని అప్రజాస్వామిక విధానాలను అన్నమయ్య జిల్లాలో అమలు చేస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్నారని వీరు మండిపడ్డారు. బుద్ధుని, బౌద్ధ అమరావతి రాజధాని పేరుతో వాడుకుంటూ సౌత్ ఆసియా దేశాల సహాయ సహకారాలు పొందుతున్న కూటమి ప్రభుత్వం రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారి సొంత జిల్లాలో బుద్ధుని తల నరికిన ఉన్మాద ఘటనపై ఇప్పటివరకు కూటమి ప్రభుత్వం స్పందించకపోవడం చాలా బాధాకరం విషయం ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే స్పందించి గౌతమ బుద్ధుని తలనరిగిన ఉన్మాద దుర్ఘటనపై, అన్నమయ్య జిల్లా ఎస్పీ విద్యాసాగర్ నాయుడు అప్రజాస్వామిక , అవినీతి చర్య పై విచారణ చేసి తగు చర్యలు తీసుకోవాలని లేనిపక్షంలో త్వరలో చలో మదనపల్లి పిలుపునిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బాస్ నాయకులు పాలకుంట చౌడప్ప, జడ ప్రకాష్, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.






# పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమావేశం

**శాంతిపురం (రిపబ్లిక్ న్యూస్) జూలై 7:** సోగడబల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000-2001 సంవత్సరంలో పదవ తరగతి చదువుకున్న పూర్వ విద్యార్థిని విద్యార్థుల 25 సంవత్సరాల తర్వాత అప్పటి ఉపాధ్యాయులతో కలిసి అప్పటి గత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ భవిష్యత్తు కోసం కలిసి పని చేయడానికి ఒకరికొకరు మద్దతు ఇవ్వడం జరిగింది పూర్వ విద్యార్థులు అందరూ కలిసి పూర్వపు ఉపాధ్యాయులను సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమానికి విశ్రాంతి ప్రధాన ఉపాధ్యాయులు మునికృష్ణ నాయుడు,ప్రస్తుత పాఠశాల ప్రధానోపాధ్యాయులు ధనాంజయులు గారిని ఘనంగా సత్కరించడం జరిగింది ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పూర్వ విద్యార్థుల పాల్గొనడం జరిగింది

### కూటమి ప్రభుత్వం జగన్మోహన్ రెడ్డి పై
# దాడి చేసేందుకు కుట్ర పన్నుతోంది.....

**తిరుపతి జూలై7(రిపబ్లిక్ న్యూస్)**
మామిడి రైతులను పరామర్శించేందుకు వస్తున్న వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పై దాడి చేయడానికి కూటమి కుట్ర పన్నుతోంది.శాంతి భద్రతలకు విఘాతం కలిగించే విధంగా కూటమి ఎమ్మెల్యేలు వ్యూహ రచన చేస్తున్నారని వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఉమ్మడి చిత్తూరు జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర రెడ్డి తెలిపారు.పోలీసు శాఖ ఈ కుట్రలకు చెక్ పెట్టి మా నాయకుడు వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పర్యటన శాంతియుతంగా జరిగే విధంగా చూడాలని జిల్లా పోలీసులకు విజ్ఞప్తి చేశారు.




### బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ నుంచి పదివేల క్యూసెక్కుల సాగునీటిని
# విడుదల చేసిన ఎమ్మెల్యేలు గిత్త.జయసూర్య, బుడ్డా.రాజశేఖర్ రెడ్డి

**పాములపాడు జులై-7 రిపబ్లిక్ న్యూస్:-**
నందికొట్కూరు నియోజకవర్గం, జూపాడు బంగ్లా మండలంలోని, పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ నుంచి శ్రీశైలం కుడి గట్టు ప్రధాన కాల్వ ద్వారా పాములపాడు మండలంలోని, బానకచెర్ల క్రాస్ రెగ్యులేటర్ వద్దకు 20,000 వేల క్యూసెక్కుల నీరు వచ్చి చేరుతోంది. అక్కడి నుంచి తెలుగుగంగ కాల్వ ద్వారా వీబీఆర్‌కు 10,000 వేల క్యూసెక్కులు, కేసీసీ ఎస్కేప్ ఛానల్‌కు 6,740 క్యూసెక్కుల సాగు నీటిని నందికొట్కూరు నియోజవర్గం ఎమ్మెల్యే గిత్త.జయసూర్య, శ్రీశైలం నియోజకవర్గం ఎమ్మెల్యే బుడ్డా.రాజశేఖర్ రెడ్డి లు బటన్ ఆన్ చేసి, విడుదల చేయడం జరిగింది.ఈ సందర్భంగా ప్రింట్ అండ్ ఎలక్ట్రానిక్ మీడియా విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యేలు గిత్త.జయసూర్య, బుడ్డా.రాజశేఖర్ రెడ్డి లు మాట్లాడుతూ ప్రతి చెరువులను,



కుంటలను నింపాలన్నదే సీఎం చంద్రబాబు నాయుడు ఆలోచన మేరకు సమగ్ర చర్యలు తీసుకుంటున్నాం అన్నారు. ప్రస్తుతం రాష్ట్రంలో కొంత మేర వర్షాభావ పరిస్థితులు నెలకొన్న నేపథ్యంలో రైతులందరికీ ప్రాజెక్టుల ద్వారా సాగునీరు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉందన్నారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ వీరం ప్రసాద్ రెడ్డి, ఆత్మకూరు రూలర్ సిఐ- ఎం.సురేష్ కుమార్ రెడ్డి, పాములపాడు ఎస్ఐ- కే.సురేష్ బాబు, తెలుగుదేశం పార్టీ నాయకులు వేంపెంట కంభం. మోహన్ గౌడు, గంట.రమేష్, లక్ష్మీకాంతరెడ్డి, తుమ్మలూరు జి. రామలింగారెడ్డి, ఎర్రగూడూరు హరినాథ రెడ్డి, తెలుగు యువత జిల్లా ప్రధాన కార్యదర్శి పిఏ. మద్దిలేటి, ఎమ్మెల్యే గవర్నమెంట్ రవీంద్ర, అధికారులు, నాయకులు, రైతులు, పోలీస్ సిబ్బంది, పాల్గొనడం జరిగింది.

### కంగ్టి మండలంలోని వివిధ గ్రామాల్లో ఘనంగా
# ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవం

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై08రిపబ్లిక్ న్యూస్**
నారాయణఖేడ్ నియోజకవర్గం కంగ్టి మండలము తాడుక్కల్ గ్రామ లో లాలు కుమార్ మాట్లాడుతూ,భారతీయ సామాజిక ఉద్యమాల చరిత్రలో ఎమ్మార్పీఎస్ ఉద్యమం చారిత్రాత్మకమైనదనీ, సామాజిక విప్లవాల సూర్యుడుగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ యుగ పురుషుడుగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. సామాజిక న్యాయం పునాదిగా ముప్పై ఏళ్ల పాటు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేసి విజయం సాధించారని అన్నారు. మాదిగ జాతికి ఆత్మ గౌరవ ప్రతీకగా భారతీయ సమాజంలో నిలిచిపోయారని కొనియాడారు. అవమానాలు అడ్డంకులు ఆటుపోట్లు జైలు, కేసులు నిర్బంధాలు ఇవన్నీ తట్టుకొని 30 సంవత్సరాలుగా అలుపెరుగని పోరాటంతో అంతిమ లక్ష్యం ఎస్సీ వర్గీకరణ సాధించుకున్నాం అలాగే అన్ని వర్గాల కోసం అనేక పోరాటాలు చేస్తూ ఆరోగ్యశ్రీ కార్డు వృద్దులు వితంతువులు వికలాంగుల పింఛన్ల పెంపు



కొరకు రేషన్ కార్డు బియ్యం కోటా పెంపు కొరకు మహిళలపై అత్యాచారాలు జరిగినప్పుడు ఫాస్ట్రక్ కోర్టుల కోసం ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీలపై దాడులు జరిగినప్పుడు వారికి అండగా నిలబడి ఖండించి వారికి మనోర ధైర్యం నింపి అండగా నిలబడ్డ సంఘం ఎంఆర్పిఎస్ , ఇన్ని సంవత్సరాల ఈ పోరాటానికి అన్ని వర్గాలు ఉద్యమానికి సహకరించిన శ్రేయోభిలాషులు అందరికీ కూడా ప్రత్యేక కృతజ్ఞతలు తెలుపుతూ భవిష్యత్తులో పద్మశ్రీ మందకృష్ణ మాదిగ అడుగుజాడల్లో నడుస్తూ రాజ్యాధికారం దిశగా ఎస్సీ ఎస్టీ బీసీ మైనార్టీ అగ్రకుల పేదలందరూ మందకృష్ణ మాదిగ గారి అడుగుజాడల్లో నడవాలని అందరికీ సమన్యాయం చేసే విధంగా అన్నగారి ఆలోచన విధానం ముందుకు నడిపించాలని పిలుపునివ్వడం జరిగింది ఆవిర్భావ వేడుకలు ఘనంగా నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో అధిక సంఖ్యలో మహిళలు ఎంఆర్పిఎస్ నాయకులు యువకులు డప్పులతో పాల్గొనడం జరిగింది.

# ప్రజల రక్షణే మా ప్రథమ కర్తవ్యం

### జగ్గయ్యపేటలో కుక్కకాటుకు గురైన బాధితులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పరామర్శించారు



**ఎన్టీఆర్ జిల్లా జగ్గయ్యపేట ప్రతినిధి, జులై 7 (రిపబ్లిక్ న్యూస్)**
జగ్గయ్యపేట పట్టణాన్ని కలకలం రేపిన వీధికుక్కల దాడిలో గాయపడిన పలువురు బాధితులను స్థానిక ప్రభుత్వ ఆసుపత్రిలో ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య పరామర్శించారు. గాయాల పాలైన మహిళలు, వృద్ధులను వ్యక్తిగతంగా పలకరించి ధైర్యం చెప్పారు. బాధితుల ఆరోగ్య పరిస్థితిని వైద్య సిబ్బందితో చర్చించి, అత్యవసర చికిత్స అందించేందుకు ప్రత్యేక హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య మాట్లాడుతూజగ్గయ్యపేట ప్రజలు భయాం దోళన లేకుండా జీవించాల్సిన అవసరం ఉంది. వీధికుక్కల సమస్యను సీరియస్‌గా తీసుకుని మున్సిపల్ అధికారులు వెంటనే సమగ్ర చర్యలు చేపట్టాలి. ఇలాంటి ఘటనలు మరల జరగకుండా కఠిన చర్యలు తీసుకుంటాం. ప్రజల రక్షణే మా ప్రథమ కర్తవ్యం అని అన్నారు. మున్సిపల్ అధికారులు, స్థానిక వాలంటీర్ల తో సమావేశం ఏర్పాటు చేసి, వీధికుక్కల నియంత్రణ కోసం ప్రత్యేక డ్రైవ్ ప్రారంభించను న్నట్టు ఎమ్మెల్యే ప్రకటించారు. ప్రజల సమస్యలు పరిష్కరించ డంలో ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందన్న సందేశం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ %ణ% తులసి వెంకటకృష్ణ రావు మరియు కూటమీ నాయకులు పాల్గొన్నారు.

# ఓటరు నమోదు ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలి

### ఇంటింటికి తిరిగి అర్హులైన ఓటర్లను గుర్తించాలి

### సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ - మండల బూత్ లెవెల్ అధికారుల శిక్షణ కార్యక్రమం

యాలాల జూలై 7 (రిపబ్లిక్ న్యూస్)
ఓటర్ల నమోదు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించాలని, ఎలాంటి తప్పులు లేకుండా ఓటర్ల జాబితాను తయారు చేయాలని సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ పేర్కొన్నారు. సోమవారం యాలల మండల కేంద్రంలో జడ్.పి.హెచ్.ఎస్ బాలుర పాఠశాలలో నిర్వహిస్తున్న బూత్ లెవెల్ అధికారుల శిక్షణ కేంద్రాన్ని సబ్ కలెక్టర్ ఉమాశంకర్ ప్రసాద్ సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తప్పులు లేకుండా ఓటరు జాబితాను సిద్ధం చేయాలని అన్నారు. ఫామ్-6, ఫామ్-6ఏ, ఫామ్-6బి, ఫామ్-7,ఫామ్-8 లపై శిక్షణపై అధికారులు,ట్రైనర్లు,సూపర్ వైజర్ లు ఓటర్ల నమోదులో జాగ్రత్తగా నిర్వహించాలని,బీఎల్ఓ లు ఇంటింటికి తిరిగి 18ఏండ్లు నిండి ఓటరునమోదుకు అర్హులైన వారికి గుర్తించాలన్నారు.ఓటరు నమోదులో మార్పులు,చేర్పుల, చనిపోయిన వారి వివరాల తొలగింపు వంటి వివరాలను పకడ్బందీగా సేకరించానల్నారు. ఓటరు నమోదులో ఎలాంటి తప్పులు దొర్లకుండా చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత అధికారులదే అని అన్నారు.ఈ కార్యక్రమంలో తహసీల్దార్ వెంకట స్వామి డిప్యూటీ తహసీల్దార్,కిరణ్, ఆర్ఐ లు వేణు, శివచరణ్, మాస్టర్ ట్రైనర్స్ గాజుల వీరేశం, గాజుల బస్వరాజ్,మండల పరిధిలోని బీఎల్ఓ లు శిక్షకులు,సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



# మీకోసం - ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం







**తిరుపతి జూలై 7(రిపబ్లిక్ న్యూస్)**
తిరుపతిజిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించిన జిల్లా ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు ఐపీఎస్ గారు.
జిల్లా నలుమూలల నుండి సోమవారం నాడు జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ వి. హర్షవర్ధన్ రాజు ఐపీఎస్., గారి ఆధ్వర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం జరిగింది.ప్రజల నుండి జిల్లా ఎస్పీ గారు నేరుగా ఫిర్యాదులను స్వీకరించి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.బాధితులు చెబుతున్న ప్రతి ఒక్క సమస్యలను వివరాలతో సహా ఎస్పీ అడిగి తెలుసుకుని సంబంధిత అధికారులకు పంపించి త్వరగా పరిష్కరించమని ఆదేశించారు. బాధితులు చెబుతున్న మాటలలో వాస్తవికతను దృష్టి లో పెట్టుకుని సమస్యలను పరిష్కరించడంలో వేగం పెంచాలని అధికారులకు ఆదేశించిన ఎస్పీ గారు.
బాధితులు మన వద్దకు వచ్చి ఫిర్యాదు చేస్తే ఆసమస్యను మనం పరిష్కరిస్తే వాళ్ళకు కలిగే అనందం చెప్పలేనిదన్నారు.ప్రతి ఒక్క సిబ్బంది... ప్రజల సమస్యలను పరిష్కరించడంలో జవాబుదారీతనం కలిగి ఉండాలన్నారు. ప్రత్యేకించి వికలాంగులు, వృద్ధులు, మహిళల ఫిర్యాదులకు మొదట ప్రాధాన్యత ఇవ్వాలని మరోసారి సిబ్బందికి ఆదేశించారు.అవకాశాన్ని బట్టి వికలాంగులు, వృద్ధులు, మహిళల సమస్యలను సత్వరమే సమగ్ర విచారణ జరిపి, వారి సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ గారు తెలిపారు.ఇదిలా ఉంటే గ్రీవెన్సీ జరుగుతున్న సమయంలో నేరుగా బాదితుల వద్దకు వచ్చి వారి సమస్యలను అడిగితెసుకున్నారు.బాధితులు చెబుతున్న సమస్యలు సంబంధిత పోలీసు అధికారుల తో మాట్లాడి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకొవాలని ఎల్ అండ్ ఓ ఏఎస్పి రావిమనోహరచారి గారిని ఆదేశించారు.జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేనటువంటి ప్రజలు జిల్లాలోని పోలీస్ స్టేషన్లో, సర్కిల్ కార్యాలయాలు, సబ్ డివిజన్ కార్యాలయాలలో ఫిర్యాదు చేయవచ్చన్నారు.
ఆ ఫిర్యాదులను మీకోసం - ప్రజా సమస్య పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో సత్వర న్యాయం చేయడం జరుగుతుందని జిల్లా ఎస్పీ వి. హర్షవర్ధన్ రాజు ఐపీఎస్., తెలిపారు.
ఆయా పోలీస్ స్టేషన్ లో అధికారులు స్పందించని పక్షంలో... అలాంటి సిబ్బంది పై చర్యలు తప్పవని హెచ్చరించారుఈ రోజు 97 ఫిర్యాదులు వచ్చినవాటిని సంబంధిత పోలీస్ అధికారులకు అప్పగించి సకాలంలో పరిష్కార మార్గం చూపవలసిందిగా ఆదేశాలు ఇచ్చారు.
ఈ కార్యక్రమం లో అదనపు ఎస్పీలు రావిమనోహరచారి శాంతి భద్రతలు, నాగభూషణం క్రైమ్స్,సీఐలు ఎస్బి .,హరి ప్రసాద్, .రామయ్య వెంకటరమణ,తిమ్మయ్య, రాములు ఇమ్రాన్ బాషా, మురళి కృష్ణ మరియు పిర్యాదు దారులు పాల్గొన్నారు.

# మహిళా సంఘాల సభ్యులు
# కొత్త ఆలోచనలతో ముందుకు రావాలి
### సంగారెడ్డి జిల్లా కలెక్టర్





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై08రిపబ్లిక్ న్యూస్** సంగారెడ్డి జిల్లా కేంద్రంలో కలెక్టర్ మాట్లాడుతూ వ్యాపార అభివృద్ధికి మహిళా సంఘాల సభ్యులు కొత్త ఆలోచనలతో ముందుకు రావాలని కలెక్టర్ ప్రావీణ్య అన్నారు. సంగారెడ్డి లోని పాత డిఆర్డిఏ కార్యాలయంలో మహిళా సంఘాల సభ్యులతో సోమవారం సమావేశం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ మహిళా సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలు అందిస్తామని చెప్పారు. ఇందిర మహిళా శక్తి పథకాలను విజయవంతం చేయాలని సూచించారు.

# జుక్కల్ నియోజకవర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన మరియు ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన,మంత్రి,ఎంపీ, ఎమ్మెల్యేలు





**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై08రిపబ్లిక్ న్యూస్**
కామారెడ్డి జిల్లా జుక్కల్ నియోజకవర్గం లో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపన మరియు ప్రారంభోత్సవ కార్యక్రమానికి విచ్చేసిన తెలంగాణ రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి వారితోపాటుజహీరాబాద్ పార్లమెంట్ సభ్యులు సురేష్ కుమార్ శేట్కర్ నారాయణఖేడ్ శాసనసభ్యులు డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి , జుక్కల్ ఎమ్మెల్యే తోట లక్ష్మీకాంతరావు అనంతరం వారు మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం మరియు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు కాంగ్రెస్ పార్టీ అధికారం లోకి వచ్చి 2 సంవత్సరల కాలం కాక ముందే ప్రజలకు ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేయడం జరిగిందని వారు అన్నారు .రైతులకు రైతు భరోసా పథకం కింద ఒక్క ఎకరాకు 6000 వేల చొప్పున రైతుల ఖాతాలో జమ చేయడం జరిగింది అని అర్హులైన ప్రతి ఒక్క పేదవాడికి ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా ఐదు లక్షల రూపాయలతో కొత్త ఇండ్లను నిర్మిస్తున్నాం అని మంత్రి అన్నారు .గత బిఆర్ఎస్ ప్రభుత్వం లో తెలంగాణ రాష్ట్రన్నీ అప్పుల కుప్పగా మార్చి రాష్ట్రం మొత్తాన్ని అల్లకల్లోలం సృష్టించి ఈ విషయాన్ని గమనించిన తెలంగాణ రాష్ట్ర ప్రజలు బిఆర్ఎస్ ప్రభుత్వన్నీ దొరల పాలనను గద్దె దింపి ప్రజా ప్రభుత్వన్నీ ఏర్పాటు చేశారని ఈ సందర్భంగా వారు అన్నారు .ఈ కార్యక్రమంలో వారితోపాటు పాటు జిల్లా ఉన్నతాధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు

# రెస్టారెంట్ ప్రారంభోత్సవంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై08రిపబ్లిక్ న్యూస్:** నారాయణ ఖేడ్ నియోజకవర్గం మున్సిపాలిటీ పరిధిలో సాగర్ శేట్కార్, రజనీకాంత్, సంజు పటేల్, రాజా గౌడ్ , నూతనంగా ఏర్పాటు చేసిన తాజా రెస్టారెంట్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి హాజరై వారికి శుభాకాంక్షలు తెలియజేసిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి,వారితోపాటు మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్ మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ పరశురాం మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు అభిషేక్ షెత్కార్, విట్టల్, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్, మాజీ ఎంపీటీసీ ముజామిల్, మాజీ సర్పంచులు సంగప్ప, రవీందర్, ప్రసాద్,టిఆర్ఎస్వి నియోజకవర్గ అధ్యక్షులు అంజా గౌడ్, యువత అధ్యక్షులు మచ్చేందర్, తదితరులు ఉన్నారు.

# మాజీ సర్పంచ్ దంపతులను సన్మానించిన మాజీ ఎమ్మెల్యే




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై08రిపబ్లిక్ న్యూస్** నారాయణఖేడ్ మండలం అత్వర్ గ్రామ తాజా మాజీ సర్పంచ్ సామెల్ గారి 25 వివాహ వార్షికోత్సవ కార్యక్రమానికి కొన్ని కారణాలవల్ల రాలేకపోవడంతో వారి ఇంటికి వెళ్లి వారి దంపతులను శాలువాతో సన్మానించిన శుభాకాంక్షలు తెలియజేసిన నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి ,వారితోపాటు మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్ మున్సిపల్ మాజీ కౌన్సిలర్లు అభిషేక్ షెత్కార్, విట్టల్, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్, మాజీ మున్సిపల్ కోఆప్షన్ సభ్యుడు అంబదాస్,కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు మల్గొండ మాజీ సర్పంచులు రవీందర్, ప్రసాద్, యువత అధ్యక్షులు మచ్చేందర్, సలీం,తదితరులు ఉన్నారు.

# ఘనంగా మాజీ సర్పంచ్ జన్మదిన వేడుకలు.. పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై08రిపబ్లిక్ న్యూస్**
నారాయణఖేడ్ మండలం తుర్కపల్లి తండా తాజా మాజీ సర్పంచ్ రవీందర్ గారి జన్మదినం సందర్భంగా నియోజకవర్గ పార్టీ కార్యాలయంలో వారి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు నారాయణఖేడ్ మాజీ శాసనసభ్యులు మహారెడ్డి భూపాల్ రెడ్డి ,కేక్ కట్ చేయించి వారికి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు..మాజీ జడ్పీటీసీ లక్ష్మీబాయి రవీందర్ నాయక్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు అభిషేక్ షెత్కార్, విట్టల్, పట్టణ పార్టీ అధ్యక్షులు నగేష్ సెట్, మాజీ సర్పంచులు మాణిక్ రెడ్డి,సామెల్, ప్రసాద్,కురుమ సంఘం తాలూకా ఉపాధ్యక్షులు మల్గొండ,యువత అధ్యక్షులు మచ్చేందర్, దస్తగిరి తదితరులు ఉన్నారు.

# పరామర్శ




**జగిత్యాల జిల్లా ప్రతినిధి, జులై 07 ( రిపబ్లిక్ న్యూస్)**
జగిత్యాల జిల్లా ఎండపల్లి మండలం ముంజంపల్లి గ్రామ మాజీ సర్పంచ్ చొప్పదండి పద్మ- బుచ్చి లింగయ్య అనారోగ్యంతో బాధపడుతూ ఇటీవల శాస్త్ర చికిత్స చేసుకోని ఆస్పత్రి నుండి డిశ్చార్జ్ అయి ఇంటికి రాగా, కార్యకర్తల ద్వారా విషయాన్ని తెలుసుకున్న రాష్ట్ర మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ సోమవారం ఆమెను పరామర్శించి, ఆరోగ్య పరిస్థితులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎండపల్లి మండల కేంద్రానికి చెందిన సాయిని నారాయణరావు ఇటీవల మృతి చెందగా ఆయన పెద్దకర్మ కార్యక్రమానికి హాజరై, చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించి, వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి తెలిపారు. మాజీ మంత్రి కొప్పుల వెంట ఎండపల్లి మండల బిఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు సింహాచలం జగన్, సీనియర్ వ్యాళ్ళ రాంరెడ్డి, వెల్గటూర్ మండల పరిషత్ మాజీ కో ఆప్షన్ సభ్యుడు ఎండి. రియాజ్, గాదం భాస్కర్, కొమ్ము సంజీవ్, మహిపాల్ రెడ్డి తదితరులున్నారు.

# జహీరాబాద్ నియోజకవర్గంలో వివిధ ప్రాంతాల్లో ఎంఆర్పిఎస్ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో పాల్గొన్న

## స్థానిక ఎమ్మెల్యే, మాణిక్ రావు,బీజేపీ సీనియర్ నాయకురాలు జ్యోతి పండాల్.

**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై08రిపబ్లిక్ న్యూస్**
జహీరాబాద్ పట్టణ కేంద్రంగా అబ్రహం మాదిగ సమన్వయంతో,ఉల్లాస్ మాదిగ ఆధ్వర్యంలో స్థానిక రాభసా గృహం నందు మరియు కోహిర్ మండలంలో వెంకటాపుర్ ఎంఆర్పిఎస్ అధ్యక్షుడు రవికుమార్ గారి ఆధ్వర్యంలో జరిగిన ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవ వేడుకల్లో జ్యోతి పండాల్ పాల్గొనడం జరిగింది. ఈ కార్యక్రమాల్లో జ్యోతి పండాల్ మాట్లాడుతూ భారతీయ సామాజిక ఉద్యమాల చరిత్రలో ఎమ్మార్పీఎస్ ఉద్యమం చారిత్రాత్మకమైనదనీ, సామాజిక విప్లవాల సూర్యుడుగా పద్మశ్రీ మందకృష్ణ మాదిగ యుగ పురుషుడుగా చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. సామాజిక న్యాయం పునాదిగా ముప్పై ఏళ్ల పాటు ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణ కోసం అలుపెరుగని పోరాటం చేసి విజయం



సాధించారని అన్నారు. మాదిగ జాతికి ఆత్మ గౌరవ ప్రతీకగా భారతీయ సమాజంలో నిలిచిపోయారని కొనియాడారు. వర్గీకరణ ఉద్యమంలో అసువులు బాసిన అమరులకు నివాళులు అర్పించారు. మందకృష్ణ గారి పోరాటాన్ని గుర్తించి ఎస్సీ వర్గీకరణ చేసిన ఘనత బిజెపికె దక్కుతుందని అలాగే వారి పోరాటానికి గుర్తుగా పద్మశ్రీ అవార్డుతో వారిని సత్కరించిన ఘనత కూడా బిజెపికె దక్కుతుందని జ్యోతి పండాల్ అన్నారు. అలాగే అక్కడికి వచ్చిన పెద్దలు ఎమ్మెల్యే మాణిక్ రావు గారితో మరియు మాజీ ఎస్సి కార్పొరేషన్ చైర్మన్ నరోతం గారితో వివిధ పార్టీ నాయకులను మరియు జ్యోతి పండాల్ నీ సన్మానించడం జరిగింది.ఎమ్మార్పీఎస్ ఆవిర్భావం మరియు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ జన్మదినం ఒకే రోజు కావడంతో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీ నాయకులు, ఎమ్మార్పీఎస్ టీం మరియు తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా మొహర్రం వేడుకలు

**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి ధర్మారం జులై 7 (రిపబ్లిక్ న్యూస్)**
పెద్దపల్లి జిల్లా ధర్మారం మండల కేంద్రంలోని మొహరం వేడుకలు ఘనంగా జరిగాయి తొమ్మిది రోజుల పాటు జరిగిన ఈ వేడుకలు చివరి రోజైన ఈ రోజున గుండం లో పాలు పొంగించి పీరీలకు దస్తీ లు కట్టి మొక్కులు చెల్లించుక్కున్నారు పులి వేషాదరణ తో పీరీ లతో గ్రామం లోని ప్రధాన విధులా గుండా ఊరేగింపు చేశారు ఈ కార్యక్రమంలో ధ్యాగేటి భూమేష్ వేల్పుల తిరుపతి గంగాధర రాజు ఎండి రఫీ షాబీ ర్ మిజబ తదితరులు పాల్గొన్నారు

# నేడు జులపల్లి మండలంలో గొర్రెలకు మేకలకు ఉచిత మందుల పంపిణీ యాదవ చారిటబుల్ ఆధ్వర్యంలో..



**పెద్దపల్లి జిల్లా ప్రతినిధి జులై 7 (రిపబ్లిక్ న్యూస్)**
పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండల కేంద్రంలోని కుర్మపల్లి బీరప్ప దేవాలయం వద్ద ఉదయం 8 గంటలకు, యాదవ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గొర్రెలకు, మేకలకు మరియు పశువులకు ఉచిత మందుల పంపిణీ కార్యక్రమం చేపట్టినట్లు యాదవ చారిటబుల్ ట్రస్ట్ అధ్యక్షులు మారం తిరుపతి యాదవ్ ఒక ప్రకటన లో తెలిపారు కావున ఇట్టి కార్యక్రమన్ని గొర్రెల మేకల ,పశువుల కాపరులు సద్వినియోగపర్చుకోగలరని ఆయన కోరారు

# కల్హేర్ మండల కేంద్రంలో పలు గ్రామాల్లో 31 వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు






**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై08రిపబ్లిక్ న్యూస్**
నారాయణఖేడ్ నియోజకవర్గం కల్హేర్, బీబీపేట్, కృష్ణాపూర్, మాసాన్ పల్లి గ్రామాల్లో సోమవారం ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ వేడుకలు ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ గారి ఆదేశాల మేరకు మండల ఇంఛార్జి అమృత్ బండారి సమన్వయంతో జెండా పండుగను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండాలను ఎగురవేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ నాయకులు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణ కొరకు ఎమ్మార్పీఎస్ చేసిన ఉద్యమం గొప్పది అన్నారు. అనేక ప్రభుత్వ సంక్షేమ పథకాలు నేడు ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితంగానే అమలవుతున్నాయని తెలిపారు. సామాజిక న్యాయం కోసం పోరాడుతున్న మందకృష్ణ మాదిగని గుర్తించి కేంద్ర ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో గౌరవించిందని గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు బాబురావు మాదిగ మండల నాయకులు ఎర్ర సాయిలు మాదిగ, కర్రే సంజీవులు మాదిగ, నాగధర్ ప్రకాష్ మాదిగ, కొనింటి సాయిలు మాదిగ బుడ్డా జైలు మాదిగ భూమేష్ మాదిగ , దాసు మాదిగ,శివ మాదిగ అశోక్ మాదిగ, దివాకర్ మాదిగ తదితరులు పాల్గొని విజయవంతం చేశారు

# సంగారెడ్డిజిల్లా లో సోమవారం ప్రజావాణికి 46 ఫిర్యాదులు



**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై08రిపబ్లిక్ న్యూస్**
సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ప్రజావాణి కార్యక్రమానికి 46 ఫిర్యాదులు వచ్చినట్లు కలెక్టర్ ప్రావీణ్య తెలిపారు. సంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ ప్రజావాణిలో వచ్చిన ఫిర్యాదులను వెంటనే పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్లు చంద్రశేఖర్, మాధురి పాల్గొన్నారు

# నారయణ ఖేడ్ ఆర్డిఓ కార్యాలయం ముందు ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ధర్నా




**సంగారెడ్డి జిల్లా ప్రతినిధి జులై08రిపబ్లిక్ న్యూస్**
నారాయణఖేడ్ నియోజకవర్గం నారాయణఖేడ్ కేంద్రంలో ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఆర్డిఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ మాజీ జిల్లా కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ, విద్యాశాఖ మంత్రిని ఇప్పటికీ నియమించకపోవడం దురదృష్టకరమన్నారు. ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు కిందిదొడ్డి సతీష్ మాట్లాడుతూ, రూ.8,000 కోట్ల స్కాలర్షిప్, ఫీజు రీయింబర్స్మెంట్ పెండింగ్ వల్ల విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు.

# తల్లికి వందనం, అన్నదాత పథకం అర్హులైన లబ్ధిదారులకు అందజేయండి

## డెంగ్యూ నివారణకు పకడ్బందీ చర్యలు తీసుకోవాలి

## పి4 మార్గదర్శిగా జిల్లా అధికారులు నమోదు కావాలి..జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి

**నంద్యాల.. జులై..07 (రిపబ్లిక్ న్యూస్)**
రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న తల్లికి వందనం, అన్నదాత సుఖీభవకు పథకాలకు చెందిన అర్హులైన లబ్ధిదారులకు అందజేసేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు.
సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో తల్లికి వందనం, అన్నదాత సుఖీభవ, డెంగ్యూ, పి4 మార్గదర్శి-బంగారు కుటుంబాలపై అధికారులకు కలెక్టర్ సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ..రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తల్లికి వందనం రెండవ విడత జాబితాను ఈ నెల 10వ తేదిలోపు సిద్ధం చేయాలన్నారు. నూతంగా అంగన్వాడీ నుండి ఒకటవ తరగతి, ఐదవ తరగతి నుండి ఆరవ తరగతిలో నూతనంగా చేరిన విద్యార్థిని, కూడా జాబితాలో చేర్చి తల్లికి వందనం అందేలా చూడాలన్నారు. అందుకు తల్లి బ్యాంకు ఖాతా, ఆధార్ కు అనుసంధానం అయ్యిందో లేదో తనిఖీ చేసుకోవాలన్నారు. అదే విధంగా మండల పరిధిలో



మున్సిపల్ కమీషనర్లు, ఎంపిడిఓలు ఎటువంటి సాంకేతిక సమస్యలు ఉన్న గ్రామ సచివాలయ కోఆర్డినేటర్ దృష్టికి తేవాలన్నారు.అన్నదాతకు సంబంధించి పెండింగ్ ఈనామ్ భూముల వివరాలను తహశీల్దార్, ఆర్డీఓలు సంబంధిత సైట్ లో నమోదు చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.జిల్లాలో ఎక్కువ శాతం వర్షాలు పడుతున్న నేపథ్యంలో నీటి నిల్వలు ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా విష జ్వరాల పట్ల కూడా ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. అందుకు ఎంపిడిఓలు క్షేత్ర స్థాయిలో పర్యటించి ఇబ్బంది లేకుండా చూడాలన్నారు. అంతేకాకుండా పారిశుద్ధ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ సంబంధిత అధికారులను ఆదేశించారు."పి4" (పబ్లిక్-ప్రైవేటు-పీపుల్స్-పార్ట్నర్ షిప్) సంబంధించి ఆగస్టు 15వ తేది నాటికి జిల్లాలో నమోదైన బంగారు కుటుంబాలకు చేయూతను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. అదే విధంగా జిల్లా అధికారులు కూడా మార్గదర్శులుగా నమోదై బంగారు కుటుంబాలకు అవసమైన చేయూతను అందజేయాలన్నారు.వివిధ శాఖలకు సంబంధించి వార్త పత్రికల్లో వచ్చే ప్రతికూల అంశాలపై జిల్లా అధికారులు సంబంధిత మండల అధికారుల నుండి సరైన వివరణ తీసుకోవాలన్నారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

# పోలీస్ “ప్రజా సమస్యల పరిష్కార వేదిక” కార్యక్రమానికి 75 ఫిర్యాదులు

**విచారణ జరిపి ఫిర్యాదుదారులకు చట్ట పరిధిలో న్యాయం చేస్తాం**

**జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా**




**నంద్యాల క్రైం, జులై 7, (రిపబ్లిక్ న్యూస్):** పట్టణంలోని బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన “ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెసల్ సిస్టం) కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ఫిర్యాదిదారుల నుంచి 75 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులతో చట్ట పరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు. ఈ ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, ఉద్యోగం ఇప్పిస్తానని డబ్బులు తీసుకుని మోసం చేయడం, పొలం తగాదాలు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు మొదలగునవి ఉన్నాయి.

# మహా(ఆ)నందంగా సాగిన మహానందీశ్వర దంపతుల పల్లకీసేవ





**మహానంది, జులై 7,( రిపబ్లిక్ న్యూస్):** మహానందిలో కొలువైన శ్రీ గంగ, కామేశ్వరీ దేవి సహిత శ్రీ మహానందీశ్వర స్వామి దంపతులకు సోమవారం రాత్రి పల్లకి సేవ వైభవంగా నిర్వహించారు. ఇన్చార్జి సూపరింటెండెంట్ సుబ్బారెడ్డి, వేద పండితులు చెండూరి రవిశంకర్ అవధాని, అర్చకులు ఆధ్వర్యంలో ముందుగా స్థానిక అలంకార మండపంలో స్వామి, అమ్మవార్ల మూర్తులను కొలువు చేసి గణపతి పూజ, పుణ్యాహవాచనం, అలంకార పూజ జరిపారు. అనంతరం ఆలయ ప్రాకారంలో పల్లకి సేవ వైభవంగా సాగగా పలు ప్రాంతాల భక్తులు దర్శించుకున్నారు.

# రేపు వికలాంగులకు మరియు వృద్ధుల కోసం అసెస్మెంట్ క్యాంపు

**బనగానపల్లె, జులై 07 (రిపబ్లిక్ న్యూస్)**బనగానపల్లె, అవుకు, సంజమల, కోవెలకుంట్ల, కొలిమిగుండ్ల విభిన్న ప్రతిభావంతులు ప్రభుత్వం నుంచి ఉచితంగా ఉపకరణాలు పొందేందుకు పేర్లు నమోదు చేయించుకోవాలని అధికారులు తెలిపారు.రేపు 8న బనగానపల్లె పట్టణంలో ఎంపీడీవో కార్యాలయంలో అవుకు, కొలిమిగుండ్ల, కోవెలకుంట్ల సంజామల, బనగానపల్లె మండలాలకు చెందిన విభిన్న ప్రతిభావంతులకు వయోవృద్ధులకు ఉచితంగా పరికరాలు ప్రభుత్వం ఇచ్చేందుకు పేర్లు నమోదు చేసుకుంటుందన్నారు. అర్హులైన వారు సర్టిపికెట్లతో హాజరై పేర్లు నమోదు చేయించుకోవాలని తెలిపారు.

# వక్ఫ్ బోర్డ్ స్థలంలో సీజ్ చేసిన రూములను ప్రభుత్వం అనుమతి లేకుండా ఎలా తెరుస్తారు

## వక్ఫ్ బోర్డ్ భూములు కాపాడాలి - ఎస్ ఎం డి.రఫీ

**నంద్యాల జూలై 7( రిపబ్లిక్ న్యూస్) :**
పట్టణంలో బాలాజీ కాంప్లెక్స్ లో ఉన్న వక్ఫ్ బోర్డ్ స్థలంలో ఉన్న వక్ఫ్ బోర్డ్ అధికారులు సీజ్ చేసిన రూముల్లో ఎలా తెరుస్తారని పిడిఎస్ యు రాష్ట్ర అధ్యక్షులు ఎస్ ఎం డి రఫీ ప్రశ్నించారు. ఈ సందర్భంగా పిడిఎస్యు రాష్ట్ర అధ్యక్షులు రఫీ మాట్లాడుతూ మౌలానా ముస్తాక్ అహ్మద్ 2019 సంవత్సరంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు లీజ్ తీసుకొని డబ్బులు కట్టలేదని, 2023 సంవత్సరం జనవరి 17 తేదీన డబ్బులు కట్టలేదని వక్ఫ్ బోర్డ్ అధికారులు వచ్చి ,పోలీసులు,రెవిన్యూ అధికారులతో కలిసి రూములకు సీజ్ చేయడం జరిగింది. కానీ నేడు అధికార పార్టీ అండా దండా చూసుకొని రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ తన రాజకీయ అండతో అధికారులు సీజ్ చేసిన రూముల్లో తాళాలు పళగొట్టి తన కార్యాలయంగా మార్చుకోవడం జరిగింది. రాష్ట్రంలో



కూటమి ప్రభుత్వం వక్ఫ్ బోర్డ్ భూములను కాపాడాల్సిన నాయకులే ,నేడు నంద్యాల పట్టణంలో బాలాజీ కాంప్లెక్స్ ఉన్న 1.74 సెంటు స్థలంలో
రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ మౌలానా ముస్తాక్ అహ్మద్ కబ్జాకు చేస్తున్నారని వారు తెలిపారు. ఆదివారం రాత్రి సోషల్ మీడియాలో వచ్చిన వీడియో ద్వారా స్పష్టంగా రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ కుర్చీలో కూర్చొని సీజ్ చేసిన రూముల్లో పగలగొడుతున్న కూడా ఇప్పుడు వరకు అధికారులు ఆయన పైన ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. సామాన్య ప్రజలు వక్ఫ్ బోర్డ్ స్థలంలో సీజ్ రూములు ఓపెన్ చేస్తే వక్ఫ్ బోర్డ్ అధికారులు సామాన్య ప్రజలకు ఇబ్బందులు కేసులు పెడతారు. కానీ నేటి వరకు వక్ఫ్ బోర్డ్ అధికారులు బాలాజీ కాంప్లెక్స్ లో ఉన్న స్థలంలో ఎందుకు పరిశీలన చేయలేదని ఆ నాయకుడు ద్వారా ఏమైనా మామూలు తీసుకున్నారని అనుమానం వ్యక్తం చేశారు.. రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రాష్ట్ర విద్యాశాఖ ఐటీ శాఖ మినిస్టర్ నారా లోకేష్ రాష్ట్ర మైనార్టీ శాఖ మంత్రి ఫారుక్ తక్షణమే స్పందించి ఇలాంటి వాళ్లపైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు స్థలాలను కాపాడాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో కలిసివచ్చే అన్ని మైనార్టీ సంఘాలను విద్యార్థి యువజన సంఘాలను కుల సంఘాలను కలుపుకొని పోరాటాలకు శ్రీకారం చూడతామని హెచ్చరించారు.

# నంద్యాల పట్టణంలోని హరిజన పేటలో ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవం

**నంద్యాల జిల్లా ఎంఆర్పిఎస్ కార్యదర్శి పి.ఎం. బ్రహ్మయ్య ఆధ్వర్యంలో స్థానిక హరిజన పేటలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 60వ జన్మదినం పురస్కరించుకొని 31వ ఎమ్మార్పీఎస్ ఆవిర్భావ దినోత్సవ సందర్భంగా జెండావిష్కరణ ఘనంగా నిర్వహించారు..**








**నంద్యాల.. జులై..07 (రిపబ్లిక్ న్యూస్)**
పట్టణంలోని స్థానిక హరిజన పేటలో ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ 60వ జన్మదినమును పురస్కరించుకొని ఎమ్మార్పీఎస్ 31 వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా స్థానిక హరిజన పేటలో జెండా ఆవిష్కరణ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మార్పీఎస్ జిల్లా కార్యదర్శి పి.ఎం బ్రహ్మయ్య మాట్లాడుతు ఈరోజు ఎమ్మార్పీఎస్ 31వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా జెండా ఆవిష్కరణ చేసినందుకు సంతోషంగా ఉందని తెలియజేస్తూ ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకులు పద్మశ్రీ మందకృష్ణ మాదిగ వారు మాదిగ జాతికి ఎనలేని కృషి చేశారని ఈరోజు మాదిగలకు ఎస్సీ రిజర్వేషన్ అమలు అవుతుందంటే పద్మశ్రీ మందకృష్ణ మాదిగ వారు దాదాపు 30 సంవత్సరాల పాటు పోరాటం చేశారని 31 వ సంవత్సరం లో విజయం సాధించి ఈరోజు ఎస్సీ రిజర్వేషన్ అమలుకు నోచిందని పద్మశ్రీ మందకృష్ణ మాదిగ కృషివలన నే ఈ విజయం సాధ్యమైంది అన్న విషయాన్ని గుర్తు చేశారు. కాబట్టి జీవితాంతము మాదిగ జాతి అందరము కూడా ఎల్లప్పుడూ వారికి రుణపడి ఉంటామని ఎంఆర్పిఎస్ జిల్లా కార్యదర్శి పి.ఎం.బ్రహ్మయ్య తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కమిటీ సభ్యులు కోల కళ్యాణ్ మాట్లాడుతూ రెండు కులాల మధ్య భవసారుప్యత లేదని,ఏ రెండు కులాల మధ్య ఐక్యత లేదని ఎవరి జనాభా ఎంతో దాని నిష్పత్తి ప్రకారం అంబేద్కర్ వారసులుగా ఎస్సీ కేటగిరి రిజర్వేషన్ అమలు చేయడం జరిగిందని, అదేవిధంగా గుండె జబ్బు పిల్లలకు ఆరోగ్యశ్రీ పథకము, రేషన్ కార్డు ప్రకారం రేషన్ పెంచాలని వృద్ధులు, వితంతువులకు, పింఛన్లు పెంచాలని ఇంటిని పోషించుకోలేని దివ్యాంగులకు, ఒంటరి మహిళలైన ఆడబిడ్డలకు, పింఛన్లు పెంచాలని భారతదేశంలో పోరాడిన మొదటి సమాఖ్య అని తెలియజేశారు. ఒక సామాజిక అజెండాను వర్గీకరణ అజెండాను నెత్తిన పెట్టుకొని 31 సంవత్సరాలు పోరాడుతూనే సమాజం కోసం ఒక్క మాదిగ కులానికే కాదు సమాజం మొత్తం కోసం పోరాటం చేసిన వారు అందులో ముఖ్యమైనది ఆరోగ్యశ్రీ పథకము అందరికీ అన్ని కులాలకు వర్తిస్తా ఉందన్న విషయాన్ని తెలియజేశారు. ఏదైతే రెండు కులాల మధ్య ఐక్యత ఉండదో, భావసారుప్యత ఉండదో అటువంటి కులాలు నిలువజాలలేవని, ఎదగలేవని ఆయా కులాల నిష్పత్తి ప్రకారం రిజర్వేషన్ ప్రకారం భాగాలుగా పంచాలని 30 సంవత్సరాలు పోరాడి 31 వ సంవత్సరం ఎస్సీ వర్గీకరణ అమలైంది.అది గ్రామస్థాయిలో 20 మందితో మొదలైన ఈ ఉద్యమం నేడు లక్షలాదిగా ఎగిసింది. ఢిల్లీ అధినేత ప్రధాని నరేంద్ర మోడీ స్వయంగా వచ్చి మా రాజకీయ పార్టీల తరఫున క్షమాపణలు చెబుతున్నామని మీది నిజమైన పోరాటమని అన్ని రాజకీయ పార్టీల నుండి మేము మీ జాతికి క్షమాపణ తెలియజేస్తున్నామన్నారు అదేవిధంగా మీకు వెంటనే రిజర్వేషన్ అమలు చేస్తామని చెప్పి అమలు చేశారన్న విషయాన్ని గుర్తు చేశారు.ఈ శ్రమ పద్మశ్రీ మందకృష్ణ మాదిగ శ్రమను గుర్తించిన కేంద్ర ప్రభుత్వం వారికి పద్మశ్రీ అవార్డును ఇచ్చి గౌరవించిందని తెలిపారు.ఈ గౌరవానికి ప్రత్యేకగానే ఈరోజు పద్మశ్రీ మందకృష్ణ మాదిగగా ఎదిగారని 30 సంవత్సరాల క్రితం పేరు పక్కన మాదిగ అని చెప్పుకొనేందుకు కూడా సిగ్గుపడే రోజుల్లో పరిస్థితి గతంలో రెవెన్యూ రికార్డులలో ఆర్ఎస్ రికార్డుల్లో,వన్ వే రికార్డులో ఎస్సీల కాడికి వచ్చేసరికి వెంకట్ గాడు,నర్సి గాడు,సుబ్బిగాడు అనే పేర్లు ఉండేటివి అని ఓసీలలో కరణం,రెడ్డి,శర్మ లాంటివి పేర్లు ఉండేవనీ కావున పద్మశ్రీ మందకృష్ణ మాదిగ వారికి జాతీ అంతా ఎప్పటికి రుణపడి ఉంటుందని వారికి ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నంద్యాల జిల్లా కార్యదర్శి పి.ఎమ్.బ్రమ్హయ్య, రాష్ట్ర కమిటీ సభ్యులు కోలా కళ్యాణ్, జనార్ధన్,జోసెఫ్ ,వెంకటేశ్వర్లు, అర్జున్, రమణ,రవితేజ, మధు, వెంకట్,ఆది,లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

# మహానందిలో శ్రీ కామేశ్వరీ దేవి చీరలకు విక్రయ వేలాలు




**మహానంది, జూలై 7,( రిపబ్లిక్ న్యూస్):**మహానందిలో కొలువైన శ్రీ కామేశ్వరీ దేవి అమ్మవారికి భక్తులు సమర్పించిన చీరలకు నిర్వహించిన వేలాల ద్వారా సుమారు రూ.20వేల ఆదాయం లభించినట్లు ఆలయ సూపరింటెండెంట్ నీలకంఠరాజు, టెంపుల్ ఇన్స్పెక్టర్ నాగమల్లయ్య తెలిపారు. దేవస్థానంలోని ప్రసాదాల కౌంటర్ వద్ద సోమవారం అమ్మవారి చీరల విక్రయ వేలాలు నిర్వహించారు. పలు ప్రాంతాల భక్తులు అమ్మవారి చీరలను కొనుగోలు చేశారు.

# ప్రజా అర్జీల పరిష్కారంలో నాణ్యత పెరగాలి

**రెవెన్యూ, రీసర్వే అంశాలపై ప్రత్యేక దృష్టి సారించండి..జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి**






నంద్యాల..జూలై..07 (రిపబ్లిక్ న్యూస్)
ప్రజా అర్జీల పరిష్కారంలో నాణ్యతను పెంచి అర్జీదారులు సంతృప్తి చెందేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి అధికారులను ఆదేశించారు.సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలల నుండి వచ్చిన ప్రజల నుండి అర్జీలను జిల్లా కలెక్టర్, జాయింట్ కలెక్టర్, డిఆర్ఓ స్వీకరించారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.... ప్రజా పరిష్కార వేదికకు వచ్చే అర్జీదారుల సమస్యల పరిష్కారంలో అధికారులు మెరుగైన దృష్టి సారించాలన్నారు. జిల్లాలో రెవెన్యూ, రీసర్వే అంశాలపై ఎక్కువ శాతం ఫిర్యాదులు రావడం జరుగుతుందని అందుకు ఆర్డీఓలు, తహశీల్దార్లు ప్రత్యేక దృష్టి సారించి పరిష్కారం దిశగా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను కలెక్టర్ హెచ్చరించారు. ముఖ్యంగా ఆర్డీఓలు ప్రతి రోజూ తహశీల్దార్లతో టెలి కాన్ఫరెన్స్ నిర్వహించి అర్జీలు బియాండ్ ఎస్ఎల్ఎ వెళ్లకుండా పరిష్కరించేలా చూడాలన్నారు. రీఓపెన్, గడువులోపల అర్జీలపై నేరుగా ముఖ్యమంత్రి కార్యాలయం నుండి సమీక్ష చేయడం జరుగుతుంది కాబట్టి వాటి పరిష్కారంలో జాప్యం లేకుండా చూడాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. అదే విధంగా ప్రజా పరిష్కార వేదికకు వచ్చే విభిన్న ప్రతిభావంతుల కోసం 3 సహాయకులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.

**పిజిఆర్ఎస్ ద్వారా స్వీకరించిన కొన్ని దరఖాస్తులు**

1. మిడ్తూరు మండలం, మిడ్తూరు గ్రామానికి చెందిన టి.వెంకట లక్ష్మమ్మ తన భర్త చనిపోయి రెండు సంవత్సరాలు అయ్యిందని తనకు వితంతు పెన్షన్ మంజూరు చేసేలా చూడాలని కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.
2. బనగానపల్లె మండలం, నందవరం గ్రామానికి చెందిన టంగుటూరి చిన్న సత్యనారాయణ రెడ్డి సర్వే నెం.779లో 3.15 సెంట్ల స్థలం కొనుగోలు చేయడం జరిగిందని, కానీ రిజిస్ట్రేషన్ సమయంలో సదురు సర్వే నెంబరు డిజిటల్ లాక్ తొలగించగలరని కలెక్టర్ కు అర్జీ సమర్పించారు.
3. ఉయ్యాలవాడ మండల, ఉయ్యాలవాడకు చెందిన టి.రామా నాయుడుకు ఇంజేడు గ్రామంలో 2.15 ఎకరాల పొలం ఉండగా, రీసర్వేలో అనంతరం ఇంకొక రైతు పొలం కలిపి ఆన్లైన్ లో నమోదు చేయడం ద్వారా తల్లికి వందనంకు చెందిన నగదు జమ కాలేదని, కావున రీసర్వే చేసి ఇంకొకరి పొలాన్ని తొలగించాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.ఇంకా ఈ కార్యక్రమంలో 221 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. సదురు సమస్యలన్నింటినీ నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ఓ రాము నాయక్, డిప్యూటీ కలెక్టర్లు, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# గాజులపల్లెలో గుడిసె దగ్ధం

## - కట్టుబట్టలతో మిగిలిన పేద కుటుంబం



**మహానంది, జూలై 7, (రిపబ్లిక్ న్యూస్):**మహానంది మండలం గాజులపల్లె గ్రామానికి చెందిన కుళాయి గుడిసె దగ్ధం కావడంతో కట్టుబట్టలతో మిగిలిన సంఘటన సోమవారం రాత్రి చోటు చేసుకుంది. కుళాయి, కుటుంబ సభ్యులు అనంతపురం జిల్లాలోని గూగూడు కుళాయి స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా దర్శనానికి వెళ్లారు. స్వామివారిని దర్శించుకుని తిరిగి వస్తుండగా వారికి చేదువార్త విషాదం కలిగించింది. గాజులపల్లెలోని సచివాలయం – 2 ప్రాంగణంలో నివాసం ఉంటున్న కుళాయి పూరి గుడిసె విద్యుత్ షార్ట్ సర్క్యూట్ తో కాలి బూడిదైంది. ఈ ఘటనలో సర్వం కోల్పోయినట్లు బాధితులు విలపించారు. ఇంటిపైన విద్యుత్తు తీగలు ఉన్నాయని పలుమార్లు విద్యుత్ సిబ్బంది దృష్టికి తీసుకెళ్లినా స్పందించలేదని ఆరోపించారు.

## మహానందిలో మృత్యుంజయ హెూమాలు



**మహానంది, జూలై 7, (రిపబ్లిక్ న్యూస్):**ప్రముఖ పుణ్యక్షేత్రమైన మహానందిలో ఆషాఢ మాసం, సోమవారం సందర్భంగా పలు ప్రాంతాలకు చెందిన భక్తులు మహా మృత్యుంజయ హెూమం పూజల్లో పాల్గొన్నారు. ఆలయ వేద పండితులు బ్రహ్మశ్రీ చెండూరి రవిశంకర్ అవధాని ఆధ్వర్యంలో పండితులు స్థానిక యాగశాలలో మృత్యుంజయ హెూమాలతో పాటు రుద్ర హెూమం, చండీ హెూమం నిర్వహించారు. భక్తులు ప్రత్యక్ష, పరోక్ష సేవలో పాల్గొన్నారు.

printed and published by B.Nagendra on behalf of m/s bojja publications # 14-73, Nelliveedhi, Nandyal District, Nadyal printed at Shop No:26, Sri Nidhi Tiffen Centere Opp, Srinivasa Complex, Nandyal (Dist) AP. pin-code - 518501. EDITOR: BOJJANAGENDRA, RNI No: RNI No:/2023/87888 Phone No: +91 99488 14188, Email id: prajarepublic@gmali.com